RNI NO: APTEL/25/A0108

మహిమ న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 154, | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | శుక్రవారం -04 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..

ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- ఇరాన్‌పై అమెరికా నిఘా పూర్తిస్థాయిలో ఉందన్న ట్రంప్
- అవసరమైతే మరోసారి దాడి చేస్తామని హెచ్చరిక
- హర్ముజ్‌పై తమకు బలమైన పట్టు ఉందని వెల్లడి
- ఇరాన్ తాజా దాడుల్లో 18 మంది మృతి
- అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు

యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..

మేనల్లుడు ఆకాశ్‌పై మాయావతి సంచలన నిర్ణయం

- పెద్ద బాధ్యతలకు ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదన్న మాయావతి
- కీలక పదవులకు దూరం చేసే సంకేతాలు
- పార్టీలో కొనసాగుతారని స్పష్టీకరణ
- 'ఎక్స్' ప్రొఫైల్ మార్చిన ఆకాశ్ ఆనంద్
- బీఎస్పీ జాతీయ కన్వీనర్ పదవిపై ఉత్కంఠ

స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి

- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం
- జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది
- కూటమి ప్రభుత్వం చేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది
- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలి
- నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవు

అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి



- వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలి
- అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది
- విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి
- కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయి

ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

గోదావరి జలాలు తెచ్చిన చంద్రబాబుకు ఉత్తరాంధ్ర రైతుల జేజేలు..

- పాయకరావుపేటలో పండగ వాతావరణం
- దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు
- పాయకరావుపేట వద్ద నీటిని విడుదల చేసి జలహారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు
- 4 జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు
- ఇక ఉత్తరాంధ్రకే వలసలు వస్తాయన్న ముఖ్యమంత్రి
- గోదావరి జలాలు తీసుకొచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

అమరావతి: "ఉత్తరాంధ్రకు గోదావరి నీళ్లు వచ్చాయి. ఇక ఈ ప్రాంతంలోని బీళ్లన్నీ పంటలతో కళకళలాడతాయి. అన్నవరం సత్యదేవుడి ఆశీస్సులతో అనకాపల్లికి వచ్చిన గోదారమ్మను.. వచ్చే ఏడాదికి సింహాచలం అప్పన్న చెంతకు, ఆపై అరసవల్లి సూరీడి పాదాల వద్దకు తీసుకెళ్లి, వంశధార వరకు గోదావరి జలాలను తరలిస్తాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో మిగతా 2 లో

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-- 2026కు రండి

- హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు ఈ సదస్సు
- సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో-- 2026ను ప్రారంభించాలని వినతి
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు కోసం మరో 750 ఎకరాల భూసేకరణకు సిద్ధమని వెల్లడి

వైఎస్సార్ హయాంలోనే 79 శాతం కాలువ పనులు పూర్తయ్యాయి

ప్రజాధనంతో ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు చేస్తోంది

- క్రెడిట్ కొట్టేసేందుకే స్టంట్లు.. కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు
- సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్
- పాత ప్రాజెక్టులకు క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారని ఆరోపణ
- పురుషోత్తపట్నం నీటిని పోలవరం నీళ్లుగా చూపిస్తున్నారన్న జగన్



అమరావతి: వైనీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, మిగతా 2 లో

కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

జగ్గారెడ్డి, రాజగోపాల్ రెడ్డిపై చర్యలేవని సూటి ప్రశ్న

- కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని ఖండించిన కొండా సురేఖ
- వివరణ అడగకుండానే నిర్ణయం తీసుకున్నారని ఆవేదన
- కూతురి వ్యాఖ్యలకు నేను బాధ్యురాలిని కాదంటూ స్పష్టీకరణ

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం నుంచి తనను బర్తరఫ్ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను కేబినెట్ నుంచి తొలగించాలని గవర్నర్‌కు సిఫార్సు చేసిన నేపథ్యంలో, ఈ నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎటువంటి ముందస్తు సమాచారంమిగతా 2 లో

తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్టానం వేటు

- పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం
- కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?
- ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?"
- మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ హై కమాండ్ వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా చిన్నారెడ్డిని తొలగించింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. దీంతో పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న నేతలకు సీఎం రేవంత్ బలమైన సంకేతం పంపినట్లయింది. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న మిగతా 2 లో

విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చాం

- డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తాం
- హోలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది
- హుస్సేన్ సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తాం

హైదరాబాద్: తెలంగాణలో ఆదిలాబాద్, మామూనూరు (వరంగల్) విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. మిగతా 2 లో

కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ కు రేవంత్ రెడ్డి లేఖ.. చిన్నారెడ్డిపై వేటు

పార్టీలో నెలకొన్న వివాదాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం

- సురేఖను కేబినెట్ నుంచి తొలగించేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డి తొలగింపు

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

ఉత్తరాంధ్ర ఉన్నతాంధ్రగా మారుతుంది

ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాల్లో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ కోసం ఇప్పటివరకు రూ.4,192 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.800 కోట్లతో మిగిలిన పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ నీటితో విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 23.44 టీఎంసీలు తరలించనున్నట్లు వివరించారు.

"2019లో వచ్చిన గొడ్డలి పార్టీ పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసింది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాప విముక్తి కలిగించారు" అని చంద్రబాబు విమర్శించారు. ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం ఉన్నాయని కొనియాడారు.

"గతంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లేవారు. ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు వచ్చే పరిస్థితి కల్పిస్తాం. విశాఖ ఏఐ పట్నంగా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా మారుతుంది. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలతో ఈ ప్రాంతం అభివృద్ధికి చిరునామాగా నిలుస్తుంది" అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. డేటా సెంటర్లకు నీటి కొరత వస్తుందన్నది తప్పుడు ప్రచారమని, వాటికి అవసరమైన 5 టీఎంసీల కంటే ఎడమ కాలువ ద్వారా ఎన్నో రెట్ల నీరు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

దశాబ్దాల కాలం నాటి కల సాకారమైంది. ఉత్తరాంధ్ర బీళ్లకు జీవం పోసేందుకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ తరలివచ్చింది. ఈ చారిత్రక ఘట్టంతో పులకించిపోయిన ఉత్తరాంధ్ర రైతులు, ప్రజలు.. తమ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి, ఈ అపూర్వ ఘట్టానికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచారు. పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఉత్తరాంధ్ర భూముల్లోకి అడుగుపెట్టిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న పవిత్ర జలాలను శిరస్సున చల్లుకుని, భావోద్వేగంతో కాలువలో నిల్చుని పుష్పాలు, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం గోదావరి తల్లికి సాష్టాంగ నమస్కారం చేసి తన ప్రణామం అర్పించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, మహిళలు హారతులు పడుతూ, పూలు చల్లుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు.

'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'..
ఇరాన్‌పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. "వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది" అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు. హార్ముజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హార్ముజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

యూపీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో కీలక పరిణామం..

ఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను అయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి. అప్పటివరకు ఆయనకు ముఖ్యమైన పార్టీ బాధ్యతలు అప్పగించడం సముచితం కాదు" అని మాయావతి పేర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావడంపై దృష్టి పెట్టాలని ఆమె పార్టీ నేతలకు సూచించారు. ప్రత్యర్థులు లంచాలు, బెదిరింపులు, వివక్ష వంటి మార్గాలతో బీఎస్పీని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మాయావతి వ్యాఖ్యల తర్వాత ఆకాశ్ ఆనంద్ తన 'ఎక్స్' ప్రొఫైల్‌ను కూడా మార్చారు. గతంలో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఉన్న అయన ఇప్పుడు తన ప్రొఫైల్‌లో 'బీఎస్పీ కార్యకర్త'గా పేర్కొన్నారు. దీంతో అయన మద్దతుదారుల్లో నిరాశ వ్యక్తమైంది. ఆకాశ్ ఆనంద్‌ను 2025 ఆగస్టులో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా నియమించారు. దీంతో అయన మాయావతి తర్వాత పార్టీలో కీలక నేతగా ఎదుగుతున్నారనే అంచనాలు ఏర్పడ్డాయి. యువతను బీఎస్పీ వైపు తీసుకురావడంతో పాటు యూపీలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో మాయావతి ప్రకటించారు. తాజా పరిణామాలతో ఆ అంచనాలపై అనిశ్చితి నెలకొంది.

కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్ కు రేవంత్ రెడ్డి లేఖ.. చిన్నారెడ్డిపై వేటు

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సర్కార్, పార్టీలో నెలకొన్న తీవ్ర వివాదాలకు అధిష్ఠానం తెరదించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలిగించేందుకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఆమెను బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సురేఖ స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో, ఆమెను కేబినెట్ నుంచి తొలిగించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు అధికారికంగా సిఫారసు లేఖను పంపించారు. కొండా సురేఖ కుమార్తె సీఎంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆ తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సిఫారసులకు, చివరికి బర్తరఫ్‌కు దారితీశాయి. మరోవైపు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సీనియర్ నేత చిన్నారెడ్డిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వేటు వేసింది. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి చిన్నారెడ్డిని తొలిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయన స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించింది. వీటితో పాటు ఇతర కీలక పదవుల్లోనూ ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిలను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు రండి

న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు హాజరు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో భాగంగా రక్షణ ఎక్స్‌పో--2026ను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారిద్దరూ చర్చించారు.

ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్రత్యేక సదస్సుతోపాటు ఎయిర్ షో, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, భూఉపరితల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన లైవ్ డెమోలు డిఫెన్స్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌నాథ్‌కు వివరించారు. ఈ దృష్ట్యా డిఫెన్స్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని, అహూతులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఎయిర్ షో నిర్వహణకు గగనతల అనుమతుల మంజూరు చేయాలని.. యుద్ధ విమానాల భాగస్వామ్యంతోపాటు సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా మద్దతు అందించాలన్నారు. త్రివిధ దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థల డెమోలను ఈ ఎక్స్‌పోలో ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ గురించి రాజ్‌నాథ్ సింగ్, రేవంత్‌రెడ్డి మధ్య చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూమిని సేకరించిందని రేవంత్ చెప్పారు. ఈ విమానాశ్రయం కోసం రక్షణ శాఖ మొత్తం 1,500 కోరిందని.. ఆ మేరకు మరో 750 ఎకరాల భూసేకరణ ప్రక్రియ చేపడతామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు కోసం 416.18 ఎకరాలను నామమాత్రపు రుసుముతో 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు రాజ్‌నాథ్‌కు సీఎం వివరించారు.

మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయండి..
గవర్నర్‌కు సీఎం లేఖ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ , ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి (=వజ్రుత్ష్ట =వనఎఎ) గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. అమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం కోరారు. రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో ఆమెను తొలగించాలని సీఎం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం లేఖపై గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

చిన్నారెడ్డి స్థానంలో గద్వాల్ విజయలక్ష్మి

మరోవైపు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డి స్థానంలో జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సీఎం రేవంత్ నియమించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా జి.సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏం జరిగిందంటే..

ఇటీవల పరకాల నియోజకవర్గం గీసుకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె తన వివరణ పంపారు. కుమార్తె వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. వాటితో తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని కోరారు. మరోవైపు వనపర్తి వ్యవహారంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై మాజీ మంత్రి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. వివరణ ఇవ్వాలని అయనకూ డీఏసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను హైకమాండ్‌కు పీసీసీ పంపింది. కొండా సురేఖతో పాటు చిన్నారెడ్డి వ్యవహారంపై గత రెండు రోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్, ముఖ్యనేతలు చర్చలు జరిపారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన మంత్రివర్గంలో స్థానం పొందిన సురేఖ వ్యవహారం గతంలో కూడా వివాదాస్పదమైనా, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి చర్యకు గట్టిగా పట్టుబట్టారు. పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కూడా చర్య తీసుకోవాలనడం, పీసీసీ క్రమశిక్షణ కమిటీ సైతం అదే సిఫార్సు చేసిన నేపథ్యంలో అధిష్ఠానం కూడా వారిద్దరిపై వేటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది..?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎంను ఉద్దేశించి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, దీనిపై వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు, ప్రభుత్వంపై కొందరు ఎమ్మెల్యేలు, నేతలు బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, జిల్లాల్లో బయటపడుతున్న విభేదాల నేపథ్యంలో రాష్ట్ర నేతలను ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం వారితో చర్చించిన సంగతి తెలిసిందే. తన పైన కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవటం, అనంతరం ఆమె స్వయంగా చేసిన వ్యాఖ్యలతో ఆగ్రహంతో ఉన్న రేవంత్.. సురేఖ చేసిన ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖర్గేకు వివరించారు. కొండా సురేఖ వ్యవహారాన్ని ఉపేక్షిస్తే పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లడంతో పాటు రాష్ట్ర నాయకత్వంపై లేనిపోని అపోహలకు తావిచ్చినట్లు అవుతుందని సీఎం చెప్పినట్లుగా తెలిసింది. ఇంత జరిగాక కూడా ఆమెపై చర్యలు తీసుకోకుండా ఉపేక్షించడం తగదని అన్నట్లు సమాచారం. రేవంత్ పట్టుతో కొండా సురేఖ, చిన్నారెడ్డిపైనా కూడా కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. మంత్రి వర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సు చేశారు. ఇదిలా ఉండగా.. కొండా ఫ్యామిలీ ఏ పార్టీలో చేరబోతుంది?. తెలంగాణ రాజకీయాల్లో తరువాత ఏం జరగనుంది?. కొండా రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతుంది?. కొండా సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా?. ఆమె కాంగ్రెస్‌లో కొనసాగే అవకాశముందా?" అనే చర్చ నడుస్తోంది.

వైఎస్సార్ హయాంలోనే 79 శాతం కాలువ పనులు పూర్తయ్యాయి

మొదటి పేజీ తరువాయి

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని అయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా అయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని అయన పేర్కొన్నారు.

కేబినెట్ నుంచి తొలగింపు.. కొండా సురేఖ ఏమన్నారంటే?

మొదటి పేజీ తరువాయి

ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం తన వివరణ కూడా కోరకుండా ఏకపక్షంగా ఇటువంటి చర్యలు తీసుకోవడం భావ్యం కాదని ఆమె ఆక్షేపించారు. ఇటీవల తన కుమార్తె చేసిన వ్యాఖ్యల వల్ల తలెత్తిన వివాదంపై ఆమె స్పందిస్తూ, "నా కుమార్తె స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మహిళ. ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలకు నేను బాధ్యురాలిని ఎలా అవుతాను? ఆమె వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం నాకు లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి తాను సమర్పించిన లేఖను త్వరలోనే మీడియాకు విడుదల చేస్తానని ఆమె వెల్లడించారు. ఇదే క్రమంలో పార్టీలోని ద్వంద్వ వైఖరిని ఆమె నిలదీశారు. గతంలో జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ ఎటువంటి చర్యలు తీసుకుందని ఆమె ప్రశ్నించారు. కొండా సురేఖ ఉదంతంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరింత తీవ్రమవుతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు లేఖ రాశారు. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను బర్తరఫ్ చేయడానికే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపింది.

అక్టోబరు నుంచి కొత్త పింఛన్లు: మంత్రి లోకేశ్
స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలి

అమరావతి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ దశల వారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. అర్హులకు కొత్త పింఛన్లు అందించాలని మంత్రులకు సూచించారు. కేబినెట్ భేటీకి ముందు మంత్రులతో సమావేశమైన లోకేశ్.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధమై.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబరులోగా స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని, ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా త్వరగా పరిష్కరించి.. అన్ని స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మొదట పురపాలక అతర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ, అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయి.. రాష్ట్రానికి నష్టం జరుగుతుందనే దురుద్దేశంతో ప్రతిపక్షం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాట వినని అధికారులు, శాఖకు లేదా మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించే అధికారుల విషయంలో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుండామని తెలిపారు. ఇటీవల కొన్ని సమస్యలు ఒకరిద్దరు అధికారుల పనితీరుతోనే ఉత్పన్నమయ్యాయని అభిప్రాయపడ్డారు. వైద్య రంగంలో చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో.. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ జరుగుతోందని, ఇలాంటి అంశాలపై కూడా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. (సెప్టెంబరు 9న) అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న నందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని లోకేశ్ సూచించారు. నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరును ప్రజలకు గుర్తు చేసేలా కార్యక్రమం ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున.. ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని లోకేశ్ సూచించారు.

విమానాశ్రయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుకి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో ముఖ్యమంత్రి గారు సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఫైనలైజ్ చేయడానికి సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి గారికి విజ్ఞప్తి చేశారు. మామునూరు (వరంగల్) విమానాశ్రయం టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబర్ నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తెలిపారు. తెలంగాణలో చాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని రామ్మోహన్ నాయుడు కి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని చెప్పారు. హుస్సేన్ సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి గారికి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, సురేశ్ షెట్కార్ గారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల రావు గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స

ప్రజలకు అందుబాటులో రిజిస్ట్రేషన్లు

చేయుటకు ఆఫీసు ప్రారంభం

చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం సెప్టెంబర్ 3: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలో ప్రజలకు అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు చేయుటకు కార్యాలయాన్ని శ్రీనివాసులు అధ్వర్యంలో గురువారం ఉదయం ప్రారంభించారు. హౌసింగ్ లోన్స్ చలానాలు జిరాక్స్ రిజిస్ట్రేషన్ లాంటివి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. గాజులపల్లి రోడ్డు నందు రిజిస్ట్రేషన్ ఆఫీసు ఎదురుగా ఈ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఈ కార్యాలయాన్ని ప్రతిరోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు వినియోగించుకోవచ్చని శ్రీనివాసులు తెలిపారు.

విజ్ఞాన్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

చిత్తూరు జిల్లా /బంగారుపాళ్యం సెప్టెంబర్ 3: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుని ప్రతిమను అందంగా కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ఆర్.ఎన్. జ్యోతినాథ్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవాళికి భగవద్గీత ద్వారా జీవన విధానాల గురించి గొప్ప సందేశం ఇవ్వడం జరిగిందని తెలిపారు. సాంప్రదాయ పండుగలను జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హిమగిరి,చిట్టిబాబు, రవితేజ,బేబీరాణి పలువురు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

"డ్రగ్స్ వద్దు బ్రో" విద్యార్థులకు

మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన

ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు.

చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం సెప్టెంబర్ 3: చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు పలమనేరు డి.ఎస్పీ దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ, 10వ తరగతి విద్యార్థులకు "డ్రగ్స్ వద్దు బ్రో" పేరుతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు, విద్యాభ్యాసం, భవిష్యత్తు మరియు కుటుంబ జీవితంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. చెడు స్నేహాలు, ఆకర్షణలకు లోనై మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన అనర్థాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయండి" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. సమాజంలో ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1972కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, ఈగల్ టీమ్ ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజనీరింగ్

అసిస్టెంట్ కుటుంబానికి రూ.1.20 కోట్ల ప్రమాద బీమా

యూనియన్ బ్యాంక్ ద్వారా బీమా చెక్ అందజేత

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ద్వారా రూ.1.20 కోట్ల ప్రమాద బీమా అందింది. ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఏ.ఎం. రంగస్వామి ఏప్రిల్ 1న ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన యూనియన్ బ్యాంక్ ద్వారా జీతభత్యాలు పొందుతున్న నేపథ్యంలో బ్యాంకు అందించే ప్రమాద బీమా కింద రూ.1.20 కోట్ల బీమా చెక్కును గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రంగస్వామి తల్లి లక్ష్మమ్మ, భార్య పుష్పలతకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ద్వారా జీతాలు పొందుతున్న శాశ్వత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.1.20 కోట్ల వరకు ప్రమాద బీమా అందజేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ప్రజలు బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ డి. అనిల్ కుమార్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎదుభూషణ్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ డి. హుసేన్ వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దిశ వన్‌స్టాప్

కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన న్యాయమూర్తి

రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు

బాధితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని దిశ వన్‌స్టాప్ కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వన్‌స్టాప్ కేంద్రంలో చేరే బాధితుల వివరాలను, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డుల్లో సంబంధిత అధికారుల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బాధితులకు విక్టిమ్ కాంపెన్సేషన్ (బాధితుల పరిహారం) త్వరగా అందేలా కృషి చేయాలని ఆదేశించారు. కేంద్రంలో ఉన్న బాధితులతో మాట్లాడిన న్యాయమూర్తి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి భోజనం, వసతి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్--1987 ప్రకారం అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి చట్టపరమైన సమస్యలు ఎదురైనా లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి హాజరవుతారు

పరిగి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి ధ్యేయంగా పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు అందులో భాగంగానే పరిగి మున్సిపల్ కేంద్రం పరిధిలో ఉన్న ఎనిమిదో వార్డులోని శ్రీ కృష్ణుడి దేవాలయమును పునరుద్ధరించి శ్రీకృష్ణ జన్మాష్టం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక నాయకులకు ఆదేశించడంతో శ్రీకృష్ణుడి దేవాలయాన్ని శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాన్ని పునరుద్ధరించి శుక్రవారం రోజు ఆలయం దగ్గర శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ముందుకు సాగుతున్నారు

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):

పరిగిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక నాయకులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఉన్న శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర ఏర్పాట్లను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆనం అంజనేయులు , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ అఖిల బాదం శ్రీనివాస్, దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు .. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర ఈ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టం వేడుకలు నిర్వహించనున్నట్లు పిఏసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి తెలిపారు. ఎనిమిదో వార్డులో ఉన్న శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర శుక్రవారం ఉదయం నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని 8 వ వార్డుకు సంబంధించిన కాలనీవాసులే కాకుండా పరిగి మున్సిపల్ పరిధిలోని పరిగి మండల పరిధిలోని భక్తులు శ్రీకృష్ణుడి దేవాలయాన్ని సందర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీకృష్ణుడి దేవాలయం మన పరిగి మున్సిపల్ కేంద్రంలో ఉండడం పరిగి ప్రజల అదృష్టంగా ప్రజలు శ్రీకృష్ణుడిని ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశం దొరకడం మన పరిగి ప్రజల అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ముఖ్యంగా పరిగి మున్సిపల్ పరిధిలోని భక్తులు అశేషంగా హాజరై శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర తొలిసారిగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పాలుపంచుకొని విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకృష్ణుడి దేవాలయం దగ్గర శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కావున కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా శ్రీకృష్ణుని దేవాలయాన్ని సందర్శించుకుని శ్రీకృష్ణుడి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని పరిగి మున్సిపల్ ప్రజలను సిద్ధాంతి పార్థసారథి పంతులు కోరారు ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ పరిధిలోని నాయకులు కార్యకర్తలు మండల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పెండింగ్ సివిల్, రాజీ కాదగిన క్రిమినల్, ఎక్సైజ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక్షశ్రద్ధ

ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించి ఎక్కువ కేసులు పరిష్కరించాలి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని అరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫుల్ అడిషనల్ చార్జ్ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కర్నూలు శ్రీ పి. వాసు న్యాయమూర్తులకు సూచించారు. జిల్లా న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి. లీలా వెంకట శేషాద్రితో కలిసి కర్నూలు ప్రధాన కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జిలు, మేజిస్ట్రేట్‌లు, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడితో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులకు సూచించారు. లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత ఎక్కువ కేసులకు పరిష్కారం లభించేలా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి రోజు కోర్టుల్లో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించి, రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి పరిష్కరించాలని సూచించారు సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ అనిల్ కుమార్, మొబైల్ మేజిస్ట్రేట్ అనూష, మేజిస్ట్రేట్ అపర్ణ, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఇది పత్రికలో నేరుగా ఉపయోగించుకునేలా హెడ్‌లైన్ ం సబ్‌హెడ్ ం వార్తా కథనం రూపంలో ఉంది.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

రాజీ కాదగిన క్రిమినల్, ఎక్సైజ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచన

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫుల్ అడిషనల్ చార్జ్ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కర్నూలు శ్రీ పి. వాసు సూచించారు. జిల్లా న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి. లీలా వెంకట శేషాద్రితో కలిసి నంద్యాల జిల్లా పోలీస్ అధికారులు, కర్నూలు ఎక్సైజ్ అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కోర్టుల్లో ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ కేసులను రాజీపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.ఇందులో లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారం మరియు కక్షిదారులకు ఉపయోగపడే ప్రీ సిట్టింగ్‌ల సమాచారం రెండూ ప్రధానంగా హైలైట్ చేశాను.

ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేస్తాం

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 03:- జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపరిమితిలో పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ సవరించిన షెడ్యూల్, విచారణలు పూర్తయి తుది నిర్ణయం కోసం పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఫారం-6, 7, 8ల స్వీకరణ-పరిష్కారం, బిఎల్ఓ స్టేటస్‌కు సంబంధించిన కాల్‌బుక్, ఎన్‌జీఎస్పీ ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులపై సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇప్పటికే వివరించడంతో పాటు, ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రెస్‌నోట్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ కార్యక్రమం 85 శాతం పూర్తయిందని, మిగిలిన 15 శాతం ప్రక్రియను ఈ వారంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఫారం-6, 7, 8లకు సంబంధించి సుమారు 14,000 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫారం-6 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ఎటువంటి జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ సీఈఓ కు వివరించారు. అదేవిధంగా బిఎల్ఓ స్టేటస్‌కు సంబంధించిన కాల్‌బుక్‌లో 12 అంశాలు, ఎన్‌జీఎస్పీలో 2 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వెట్టి చాకిరీ నిర్మూలన చట్టంపై

అవగాహనతో సమర్థవంతంగా అమలు చేయాలి

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 03:- వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, వెట్టి చాకిరీకి గురవుతున్న వారిని గుర్తించి తక్షణమే విముక్తి కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు ఎస్పీ ఖాదర్ బాషా సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు జిల్లా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం, 1976పై అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, కార్మిక శాఖ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, డీఆర్డీఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు, వెట్టి చాకిరీ కార్మికులను గుర్తించే విధానం, బాధితులను తక్షణమే వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించే ప్రక్రియ, వారి పునరావాసం తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అలాగే వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన బాధితులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్ర పునరావాస పథకం ద్వారా అందించే సహాయం, పునరావాస చర్యలు, బాధితుల సామాజిక, ఆర్థిక స్థిరత్వానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వెట్టి చాకిరీ నిర్మూలన అనేది కేవలం ఒక శాఖకు సంబంధించిన బాధ్యత కాదని, రెవెన్యూ, పోలీస్, కార్మిక, సాంఘిక సంక్షేమ, విద్యా, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయడం ద్వారా మాత్రమే ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ఏఎస్పీ ఖాదర్ బాషా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అనుమానాస్పద పరిస్థితులను గుర్తించి, బాధితుల హక్కులను పరిరక్షిస్తూ, చట్ట ప్రకారం వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వెట్టి చాకిరీ నిర్మూలన చట్టంపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, బాధితులను గుర్తించడం నుంచి విముక్తి, పునరావాసం వరకు చేపట్టాల్సిన చర్యలపై స్పష్టత కల్పించారు.

రీజన్సీ హైస్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.

యానాం, మహి న్యూస్, సెప్టెంబర్ 3: కేంద్ర పాలిత ప్రాంతమైన యానంలోని స్థానిక రీజన్సీ హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.ఎస్.ఎస్.వి. ప్రసాదరావు ప్రారంభించారు. అనంతరం కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. శ్రావణమాసం అష్టమి రోజున శ్రీకృష్ణ జన్మాష్టమిని జరుపుకుంటామని, శ్రీకృష్ణుడి బాల్య లీలలు, ఆయన బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. కృష్ణుడి వేషధారణలో బాలురు, గోపికల వేషధారణలో బాలికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వీక్షకులను అలరించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ఆటస్థలంలో ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకాల తాతయ్య--మహాలక్ష్మమ్మ శతజయంతి వేడుకలు

యానాం, మహి న్యూస్, సెప్టెంబర్ 3: ఫ్రెంచ్ పాలనలో 1951--1954 సంవత్సరాల మధ్య యానాం నియోజకవర్గ శాసనసభ్యుడిగా సేవలందించిన కీ.శే. కనకాల తాతయ్య సతీమణి కనకాల మహాలక్ష్మమ్మ 100వ జయంతి సందర్భంగా యానాంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం ఫెర్రీ రోడ్డులో ఉన్న కనకాల తాతయ్య విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రముఖ యాంకర్ సుమ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యాంకర్ సుమ మాట్లాడుతూ.. తమ నానమ్మ మహాలక్ష్మమ్మ 100వ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి యానాం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడూ బిజీగా ఉండే తనకు కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయం గడపడం ఎంతో సంతోషాన్ని, మనశ్శాంతిని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కనకాల రాందాస్, శ్రీనివాస్, సెందాస్, విజయ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు.

తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 3: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్.ఐ. పిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో, పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి గిరిధర్ పర్యవేక్షణలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామ తదితర పాత్రల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, వారి ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించి, శ్రీకృష్ణుడి బోధనలు, ధర్మ పరిరక్షణ గురించి ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు పాల్గొన

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!

'మిరాయ్'తో మెప్పించిన రితికా

బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్

'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్

మరిన్ని అవకాశాలతో దూసుకుపోయే ఛాన్స్

ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది.

ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

ప్రళయ్.. ధురంధర్ తర్వాత రణ్‌వీర్ సింగ్ కొత్త ప్రాజెక్టు ఇదే..

సెట్స్‌పైకి భారీ సర్వైవల్ థ్రిల్లర్

'ప్రళయ్' అనే కొత్త సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన రణ్‌వీర్ సింగ్

ముంబై నేపథ్యంలో భారీ స్థాయిలో పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్

'స్కామ్ 1992' ఫేమ్ జై మెహతా దర్శకత్వం, కీలక పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్

సుమారు రూ.300 కోట్ల బడ్జెట్‌తో బిర్లా, హన్సల్ మెహతా, రణ్‌వీర్ సంయుక్త నిర్మాణం

'ధురంధర్' సిరీస్ బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత రణ్‌వీర్ నటిస్తున్న చిత్రం

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం. సుమారు రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. భారతదేశంలో ఇంత భారీ స్థాయిలో ఇలాంటి కథాంశంతో సినిమా రావడం ఇదే తొలిసారని దర్శకుడు హన్సల్ మెహతా పేర్కొన్నారు. రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్‌పై చూపిన ఆసక్తి, నిబద్ధత వల్లే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ చిత్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనన్య బిర్లాకు చెందిన బిర్లా స్టూడియోస్, హన్సల్ మెహతా-సాహిల్ సైగల్‌కు చెందిన ట్రూ స్టోరీ ఫిలింస్, రణ్‌వీర్ సింగ్ సొంత నిర్మాణ సంస్థ మా కసమ్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జై మెహతా, విశాల్ కపూర్ కలిసి రాసిన ఈ ఒరిజినల్ కథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ

పవర్ స్టార్ 'OG2' పై బిగ్ అప్‌డేట్..

ఏర్పాట్లు పూర్తి కాగానే రెగ్యులర్ అప్‌డేట్స్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు పండుగలాంటి వార్త బయటకు వచ్చింది. టాలీవుడ్‌లో ఎంతోమంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దే కాల్ హిమ్ 'OG' సీక్వెల్ ''OG 2''పై ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇక పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్ట్ కోసం డేట్స్ కేటాయించినట్లు వార్తలు వస్తుండటంతో అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ప్రాజెక్ట్‌కి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులు పూర్తయిన వెంటనే వరుస అప్‌డేట్స్ ఇచ్చేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. ూశ్రీంశీ =ఱ్ఱఎ - రామ్ చరణ్ తర్వాత బుచ్చిబాబు కథ ఎవరికి? హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? డేట్స్ ఇచ్చేసిన పవన్ కళ్యాణ్: దర్శకుడు సుజీత్ రూపొందించిన ''OG' ప్రపంచంలో పవన్ కళ్యాణ్ 'ఓజస్ గంభీర' అలియాస్ ''OG'గా చూపించిన స్టైల్, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు పార్ట్ 2 కోసం పవన్ కళ్యాణ్ డేట్స్ కేటాయించారని తెలుస్తుండటంతో షూటింగ్ పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. మేకర్స్ ప్రాథమిక ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. సెప్టెంబర్ 2న బర్త్‌డే స్పెషల్ ప్రోమో?: ఇప్పటికే ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ''OG 2' కోసం ఒక ప్రత్యేకమైన యానిమేషన్ ప్రోమోను సిద్ధం చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోంది. ఇక పవన్ కళ్యాణ్ పుట్టినరోజైన సెప్టెంబర్ 2న ఈ స్పెషల్ ప్రోమోను విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి కొన్ని కీలకమైన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తి కాగానే అభిమానుల కోసం రెగ్యులర్ అప్‌డేట్స్ ఇవ్వడం ప్రారంభించాలని ప్రొడక్షన్ టీమ్ భావిస్తోంది. ఇక పవన్ క్యారెక్టరైజేషన్, యాక్షన్ ఎపిసోడ్స్ ఈ సీక్వెల్‌లో మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్లు టాక్. మరింత వినూత్నంగా సుజీత్ మేకింగ్: మొదటి భాగంలో పవన్ కళ్యాణ్‌ను ఒక రేంజ్‌లో చూపించిన సుజీత్, ''OG 2'ని అంతకుమించి తీర్చిదిద్దేందుకు పక్కా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇక యాక్షన్, ఎమోషన్ కలగలిపి గ్లోబల్ స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పవర్ స్టార్ అభిమానులకు ''OG 2' ఒక గ్రాండ్ విజువల్ ట్రీట్‌లా ఉండబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. పవన్ కళ్యాణ్ గ్రాండ్ ఎంట్రీ, సుజీత్ విజన్ కలగలిసి థియేటర్లలో ఏ స్థాయి సంచలనం సృష్టిస్తాయో వేచి చూడాలి.

'స్పిరిట్' లో ప్రభాస్ ఇంట్రోపై భారీ హైప్.. వంగా కొత్త ప్లాన్ ఇదేనా?

: టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాన్-ఇండియా స్థాయిలో హైప్ వున్నా మూవీస్ స్పిరిట్ కూడా ఒకటి. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఆయన పాత్రను ఎలా పరిచయం చేయబోతున్నారనే దానిపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ, అభిమానుల్లో క్యూరియాసిటీని రెట్టింపు చేస్తోంది. సెంట్రల్ జైల్లో అసలైన విధ్వంసం: తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమా ఒక సెంట్రల్ జైలు వాతావరణంలో ప్రారంభమవుతుందట. జైల్లో ఉన్నట్టుండి పెద్ద గందరగోళం చెలరేగడం, నేరస్థులు నియంత్రణ కోల్పోవడం, అక్కడున్న పోలీసులు కూడా ఆ పరిస్థితిని అదుపు చేయలేక చేతులెత్తేయడం వంటి సన్నివేశంతో కథ మొదలవుతుంది. ఇక ఈ రచ్చ జరుగుతున్న సమయంలోనే ప్రభాస్ క్యారెక్టర్ ఎంట్రీకి వేదిక సిద్ధమవుతుందని తెలుస్తోంది. భయంతో వణికించే పేరు: అయితే ఈ సీన్‌లో ప్రభాస్‌ను వెంటనే చూపించకుండా, అక్కడి నేరస్థుల భయం ద్వారా ఆయన పవర్‌ను చూపిస్తారట. ఆ పోలీస్ ఆఫీసర్ పేరు వినగానే ఖైదీల ముఖాల్లో స్పష్టమైన భయం కనిపిస్తుందట. ఇక ఎటువంటి డిజైన్డ్ ఫైట్స్ లేదా భారీ డైలాగులు లేకుండా, కేవలం ఆయన పేరుతోనే ఆ పాత్ర ఎంత ప్రమాదకరమైనదో దర్శకుడు సందీప్ వంగా చాలా పవర్‌ఫుల్‌గా ఎస్టాబ్లిష్ చేయబోతున్నారట. పాత హిందీ పాటతో వినూత్నంగా ఇంట్రో: ప్రభాస్ ఎంట్రీ ఎంతో సైలెంట్‌గా, సైకోటిక్ రేంజ్‌లో ఉండబోతోందని టాక్. ఖాకీ యూనిఫామ్‌లో ఉన్న ప్రభాస్ చాలా ప్రశాంతంగా, పాత హిందీ పాటలు వింటూ కేజువల్‌గా జైల్లోకి అడుగుపెడతారట. ఇక చుట్టూ ఉన్న నేరస్థులు భయంతో వణుకుతుంటే, ప్రభాస్ మాత్రం క్లాసిక్ సాంగ్ వింటూ కూల్‌గా కనిపించే ఈ కాంట్రాస్ట్ షాట్ సినిమాలోనే అతిపెద్ద హైలైట్‌గా నిలుస్తుందని అంటున్నారు.



మంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హీరోల లిస్ట్‌లో ఎవరెవరు ఉన్నారంటే? విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో అచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు అస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం వక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.

నాకు అండగా ఆ ఇద్దరు హీరోలు

తన కష్టకాలంలో ఇద్దరు హీరోలు అండగా నిలుస్తారన్న అనుపమ

బాధలో ఉన్నప్పుడు దుల్కర్ సల్మాన్ నుంచి మెసేజ్ వస్తుందని వెల్లడి

దుల్కర్ తర్వాత రామ్ పోతినేనిని ఎక్కువగా విశ్వసిస్తానని స్పష్టం

మాజీ ప్రియుడి నుంచి ఎదుర్కొన్న మానసిక వేధింపుల గురించి ప్రస్తావన

దుల్కర్‌తో కలిసి గతంలో మలయాళ చిత్రంలో నటించిన అనుపమ



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే. ఇదే సందర్భంగా, తన గత ప్రేమ సంబంధంలో ఎదుర్కొన్న మానసిక వేధింపుల (నార్సిసిస్టిక్ అబ్యూజ్) గురించి కూడా ఆమె ప్రస్తావించారు. అలాంటి వ్యక్తులు ఇతరులను ఎప్పుడూ తమ నియంత్రణలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తారని, ఇది చాలా నిశ్శబ్దంగా జరిగే వేధింపు అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
శుక్రవారం -04- సెప్టెంబర్ - 2026

ప్రజల సంతృప్తి మేరకు సేవలు అందాలి

గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 3 : ప్రజల సంతృప్తి మేరకు సేవలు అందాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల సంతృప్తి పెరగాలని అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు కావాలన్నారు. జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అనే కార్యక్రమాలను చేపడుతుందని తద్వారా ప్రజలు లబ్ధి పొందాలని అన్నారు. ప్రజలకు పథకాలు అమలైనప్పటికీ వాటిపై సంతృప్తి శత శాతం ఉండాలని చెప్పారు. సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం, మంచి ప్రవర్తనతో మాట్లాడటం వలన సంతృప్తి స్థాయి బాగుంటుందన్నారు. వీటిని పక్కాగా అమలు చేయాలని చెప్పారు. అర్జీలు సమర్పించిన వ్యక్తులతో నేరుగా మాట్లాడి తగిన సమాచారాన్ని అందించాలన్నారు.

జిల్లాలో పంచాయతీ సమస్యలపై సత్వర చర్యలు చేపట్టాలి

జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ

శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 3: జిల్లాలో ఉన్న పంచాయతీల్లో ఉన్న సమస్యలపై గ్రామ సభలు నిర్వహించి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ అధ్యక్షులు పిరియా విజయ డి పి ఓ ని ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1,2,4,7వ స్థాయి సంఘ సమావేశాలను ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పంచాయతీ రాజ్ పనులపై సభ్యులు చర్చించారు. జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి జిల్లా పంచాయతీల ద్వారా చేపడుతున్న పనులను వివరించారు. పోలాకి మండలంలో పంచాయతీ పనుల పై ఆ మండల జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సభ దృష్టికి తీసుకు రాగా డిపిఓ మాట్లాడుతూ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో పంచాయతీల పై ఉన్న పనులపై సత్వర చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ పిరియా విజయ చెప్పారు. శాసన సభ్యులు కూన రవి కుమార్ మాట్లాడుతూ పంచాయతీల్లో ఉన్న పనులపై గ్రామ సభలు నిర్వహించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ నిధిలన్నీ వినియోగపడే విధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం డ్వామా పిడి లవరాజు వివిజి రాంజి పథకం ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న పనులపై సభకు వివరించారు. అమదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్ మెటీరియల్ కాంపొనెంట్స్ కు సంబంధించి వివరాలను పిడిని అడిగి తెలుసుకున్నారు. ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ జిల్లాలో చేపడుతున్న పనులను సభ్యులకు తెలుపగా మందలార్లో లో ఓల్టేజీ సమస్య ఉందని సంతబొమ్మాళి, టెక్కలి మండలం జడ్పీ సభ్యులు ఎస్ఈ దృష్టికి తీసుకురాగా జిల్లాలో 720 ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తే లో ఓల్టేజీ సమస్య తీరుతుందని ఎస్ఈ సభ్యులకు వివరించారు. విద్యుత్ శాఖలో కింది స్థాయి అధికారులు పనిచేయాలని శాసన సభ్యులు కూన రవి కుమార్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్, ఆయా స్థాయి సంఘాలకు సంబంధించి సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవ వేడుకల నిర్వహకు ఏర్పాట్లు..

కాకినాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 03 : సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమించే ఉపాధ్యాయులకు సముచిత గౌరవం అందించేలా ఈ నెల 05న కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 05న కాకినాడ నగరంలోని జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో శనివారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ గురుపూజోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తో పాటు జిల్లాలోని గౌరవ ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఈ వేదికపై ఘనంగా సత్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరై, గురుపూజోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని డీఈవో పి.రమేష్ కోరారు.

ఐపీఎస్ అధికారులు విశాల్ గున్ని , కాంతి రాణా టాటా లపై సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, మహి న్యూస్, సెప్టెంబర్ 3: సీనియర్ ఐపీఎస్ అధికారులు లివిశాల్ గున్ని (2010 బ్యాచ్), కాంతి రాణా టాటా (2004 బ్యాచ్)లిలపై ఉన్న సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకుంటూ గురువారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, అప్పీల్ నిబంధనల ప్రకారం విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను ప్రభుత్వం గతంలో సస్పెండ్ చేసింది. అనంతరం వారి సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పొడిగిస్తూ వచ్చింది. తాజాగా వీరిద్దరి సస్పెన్షన్ సెప్టెంబర్ 4 వరకు అమల్లో ఉంది. ఇద్దరు అధికారుల సస్పెన్షన్ ఎత్తివేతకు సంబంధించి డీజీపీ (హెచ్ఓపీఎఫ్) ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం పరిశీలించింది. కాంతి రాణా టాటా ఆగస్టు 24న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించింది. దీంతో విశాల్ గున్ని, కాంతి రాణా టాటాలను తక్షణమే విధుల్లోకి పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వారిపై కొనసాగుతున్న క్రమశిక్షణ, క్రిమినల్ కేసులపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇద్దరు అధికారులకు ఉత్తర్వుల ప్రతులను అందజేసి, వారి నుంచి రసీదు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశించింది.

నైరా కళాశాల డీన్‌గా డాక్టర్ డి. చిన్ననాయుడు



శ్రీకాకుళం రూరల్, మహి న్యూస్, సెప్టెంబర్ 3 : నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డా. డి. చిన్ననాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1989లో కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థిగా వ్యవసాయ విద్యను ఆయన అభ్యసించారు. అనంతరం అదే కళాశాలలో వ్యవసాయ విస్తరణ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. అమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లోనూ పనిచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గవరంపేటకు చెందిన డా. చిన్ననాయుడు అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు చేపట్టడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను విద్యాభ్యాసం చేసిన కళాశాలలోనే అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు చేరువ చేసేందుకు ప్రాధాన్యం ఇస్తానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం, మహి న్యూస్, సెప్టెంబర్ 3: జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ వినతులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి రెవెన్యూ అధికారి ఈ-ఆఫీస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని, సివిల్ కోర్టు కేసులు, వివాదాస్పద భూముల కేసుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు, వివిధ ధృవీకరణ పత్రాల జారీ నిర్దేశిత గడువులోగా అందేలా తహసీల్దార్లు నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని, రీసర్వే పనుల్లో ఎటువంటి అలసత్వం సహించేది లేదని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ క్లినిక్, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఆరో విడత కింద 160 గ్రామాల్లోని 97,917.996 ఎకరాల ప్రైవేట్ భూమికి సంబంధించి రీసర్వే ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు 22,252 గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసులు జారీ చేశారని, 36,228.292 ఎకరాల్లో ఇ-కేవైసీ పూర్తయిందని సమీక్షలో వెల్లడించారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల వారీగా పనుల పురోగతిని, వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దస్త్రాల పరిష్కారాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సిగ్నల్ వ్యవస్థ లేని 70 నాన్-సిగ్నల్ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులతో పాటు 33 గ్రామాల్లో డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాల ప్రక్రియను గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని బాలవిహార్ లో పిల్లలే గురువులైన వేళ...

(మహి న్యూస్ కొత్త పేట సెప్టెంబర్ 3) : సెప్టెంబరు 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల ముందుగా ఈరోజున పిల్లలు తమకు ఉపాధ్యాయ వృత్తి పట్ల గల గౌరవ మర్యాదలను సరికొత్త రీతిలో ప్రకటించారు. పిల్లలే టీచర్లుగా తమ తరగతిలోని మిగిలిన పిల్లలకు పాఠాలు బోధించారు. 5వ తేదీన జరిగే ఉపాధ్యాయుల సత్కార సభకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా



ఉండాలని, రేపు కృష్ణాష్టమి సెలవు రావడం వల్ల ఈ ప్రత్యేక కార్యక్రమాన్నిఈరోజే చేసుకున్నామని వారన్నారు. ఇలా పిల్లల చేత పాఠాలు చెప్పించే విధానం తమ స్కూలులో కొత్త కాదని, కానీ టీచర్స్ డే సందర్భంగా ఇంతమంది పాఠాలు చెబుతామంటూ ముందుకు రావడం ఇదే మొదటిసారని, ఒక పాఠాన్ని10 సార్లు చదివితే వచ్చే అవగాహన ఒకసారి ఇతరులకు చెబితే వస్తుందని ఈ నిజాన్ని పిల్లలు అర్థం చేసుకున్నారని కరస్పాండెంట్ బుద్ధ చంద్ర దేవ్ అన్నారు. 'సెనెకా' అనే విద్యావేత్త చెప్పిన "నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం నేర్పించడమే" అనే సూక్తికి జీవం పోస్తూ 33 మంది పిల్లలు టీచర్లుగా తమను నిరూపించుకోవడానికి ముందుకు రావడం ఎంతో సంతోషదాయకమని లేదు స్కూలు అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య అన్నారు. పిల్లలే స్వయంగా టీచర్లు గా మారడం వల్ల, వాళ్ళు పాఠాన్ని బట్టీ పట్టకుండా నేర్చుకుని వచ్చారని, టీచరుకు అప్పచెప్పడానికి కాకుండా తమ తోటి పిల్లలకు బోధించడానికి ప్రిపేర్ అవుతున్నామనే ఆలోచనతో విషయాన్ని అర్థం చేసుకుంటూ చదువుకుని వచ్చారని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అలపాటి మూర్తి అన్నారు. తమ స్కూలులో పాఠాల బోధన మాత్రమే జరగలేదని బాధ్యత, నాయకత్వం, సహానుభూతి అనే మూడు అమూల్యమైన విషయాలను పిల్లలు అర్థం చేసుకున్నారని తెలుగు టీచర్ బూసి నాని కుమారి అన్నారు. బ్లాక్ బోర్డు ముందు నిలబడింది నిత్యం తమకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు కాదు. ప్రతి నిత్యం తమతో బాటు కూర్చుని పాఠాలు వినే విద్యార్థే! అనే భావం పిల్లలందరితో బాటు టీచర్లను కూడా ఆనందపరవశులను చేసిందని బయాలజీ టీచర్ అనూష అన్నారు. తాము బోధిస్తున్నామనే భావన పిల్లలలో చదువు పట్ల ఇష్టాన్ని పెంచడమే కాకుండా తమ భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను కూడా పెంచతుందని మాథ్స్ టీచర్ ఇందుభార్గవి అన్నారు. "గురువు అద్దం లాంటి వాడు కాదని , దీపం లాంటి వాడని, అద్దం మనల్ని మనకు చూపిస్తుందని, దీపం అందరికీ దారిని చూపిస్తుందని" ఈరోజు మాస్కూల్ పిల్లలు తాము టీచర్లుగా మారి పాఠాలు బోధించడం ద్వారా అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారని హిందీ టీచర్ సత్యవేణి అన్నారు. టీచర్లందరు ఈరోజు మా క్లాసు పిల్లలు పాఠాలు మాత్రమే చెప్పలేదని, గురువు స్థానం ఎంత బరువైనదో, ఎంత బాధ్యతాయుతమైనదో తెలుసుకున్నారని, ఒక పాఠం చెప్పడం కోసం టీచర్ ఎంత ఓపికగా, ప్రేమగా సిద్ధపడతారో అర్థం చేసుకున్నారనీ, నిజమైన ఉపాధ్యాయులం ఈరోజు వెనుక బెంచీలో కూర్చుని గర్వంతో ఉప్పొంగే తల్లిదండ్రుల్లా పిల్లలు పాఠాలు చెప్పే దృశ్యాన్నిచూసి మురిసిపోయామని అన్నారు. "బోధించడం అంటే జ్ఞానాన్ని నింపడం కాదు, అగ్నిని రగిలించడం" అని విలియం బట్లర్ యేట్స్ అన్నట్లు, ఈ పిల్లలు ఈరోజు తోటి పిల్లల్లో నేర్చుకోవాలనే జ్వాలను రగిలించారన్నది వాస్తవం. ఇప్పుడు పాఠాలు చెప్పిన వీళ్ళంతా చిన్నప్పుడు ప్రీప్రైమరీ చదువుకున్నప్పుడు స్కూలయ్యి ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, ఇంట్లో ఉండేవారికీ, ఇరుగుపొరుగువారికి తామే టీచర్లుగా బెత్తం పట్టుకుని అనేక ప్రదర్శనలిచ్చిన వాళ్ళే అయిఉంటారు. తెలుగు బోధనలో 8వ తరగతి విద్యార్థిని గ్రేసీ, 10వ తరగతి విద్యార్థిని ఇందు, 9వ తరగతి విద్యార్థిని హరిణి; హిందీ బోధనలో 7వ తరగతి విద్యార్థిని గోపిక, 9వ తరగతి విద్యార్థిని శ్రీదేవి,10వ తరగతి విద్యార్థి లోహిత్; ఇంగ్లీషు బోధనలో 6వ తరగతి విద్యార్థిని శరణ్య, 7వ తరగతి విద్యార్థిని వామిక, 10 వ తరగతి విద్యార్థి ఏడుకొండలు; మ్యాథమెటిక్స్ బోధనలో 10వ తరగతి విద్యార్థి అభిర్వ్, 6వ తరగతి విద్యార్థిని ప్రియాంక, 7వ తరగతి విద్యార్థిని దీప్తిశ్రీ; ఫిజిక్స్ బోధనలో 10వ తరగతి విద్యార్థిని వాసవి దుర్గ, 8వ తరగతి విద్యార్థిని కుందన ప్రియ, 7వ తరగతి విద్యార్థి పవన్; బయాలజీ బోధనలో 9వ తరగతి విద్యార్థిని పల్లవి, 10వ తరగతి విద్యార్థిని ప్రణీత, 6వ తరగతి విద్యార్థి జశ్వంత్; సోషల్ స్టడీస్ బోధనలో 10వ తరగతి విద్యార్థిని ప్రతీక, 9వ తరగతి విద్యార్థి ధనుష్, 6వ తరగతి విద్యార్థిని జ్యోత్స్నప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. సబ్జెక్టుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను నిర్ణయించడం కేవలం జడ్జింటు కోసం మాత్రమే. ఎవరినీ నిరుత్సాహపరచడానికి కాదు. ఎవరు ఎంచుకున్న పాఠాలను ఎవరి పరిధిలో వారు చాలా బాగా చెప్పారన్నది నిజమని, అందరికీ అభినందనలని కరస్పాండెంట్ బుద్ధ చంద్ర దేవ్ అన్నారు.

ధిక్కార ఖడ్గకవికి గౌరవ డాక్టరేట్

నలభై ఏళ్ల సాహితీ సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం

సమసమాజ స్థాపనకు మరింత అంకితభావంతో కృషి చేస్తానన్న ఖడ్గకవి

అమలాపురం,మహి న్యూస్,సెప్టెంబర్ 3: సామాజిక అసమానతలు, వివక్ష, అన్యాయాలపై తన కవిత్వంతో నిరంతరం ప్రశ్నిస్తూ ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్న ప్రముఖ సాహితీవేత్త, 'ధిక్కార ఖడ్గకవి' సత్యనారాయణ పినిపేకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన నాలుగు దశాబ్దాల సాహితీ సేవలను గుర్తించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, న్యూఢిల్లీ సర్వీసెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. తెలంగాణా సారస్వత పరిషత్, బొగ్గులకుంటలోని డా. సి. నారాయణరెడ్డి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. న్యూఢిల్లీ సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్, గూడూరి చెన్నారెడ్డి, ఆంధ్రప్రభ జనరల్ మేనేజర్ పసుపులేటి రమేష్ చేతుల మీదుగా పినిపే సత్యనారాయణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ గ్రహీత పినిపే సత్యనారాయణ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో జన్మించి, తొండవరం ఉన్నత పాఠశాలలో భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్న తన సాహితీ ప్రతిభను గుర్తించి, ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా తనకు గౌరవ డాక్టరేట్ అందించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న తన సాహితీ తృష్ణకు ఈ గౌరవం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.

ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని పినిపే

కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పినిపే సత్యనారాయణను అభినందించారు. ఈ సందర్భంగా తొండవరం హై స్కూల్ హెచ్ఎం. బి కేశవాచార్యులు,తోటి ఉపాధ్యాయులు అత్మీయులు అభిమానులు ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు పినిపే సత్యనారాయణ తెలిపారు.

కుష్ఠు వ్యాధి ఇంటింటి సర్వే విజయవంతంగా నిర్వహించాలి

గుంటూరు, మహి న్యూస్, ఆగస్టు 3 : జిల్లాలో కుష్ఠు వ్యాధి నియంత్రణకు చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కుష్ఠు వ్యాధి నిర్మూలన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం సెప్టెంబర్ 11 నుండి 24 వరకు కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తలు పక్కాగా ఇంటింటి సర్వే నిర్వహించాలని అన్నారు. స్పష్టమైన పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ 1174 మంది ఆశా కార్యకర్తలతో పాటు ఏ.ఎన్.ఎం, పురుష సిబ్బంది సర్వేలో పాల్గొంటారని తెలిపారు. గతంలో చేపట్టిన సర్వేలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 20 కేసులు బయట పడినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ రమేష్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీపై

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష



నరసరావుపేట, మహి న్యూస్, సెప్టెంబర్ 03: పల్నాడు జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీ మరియు సంకలనంపై జిల్లా కలెక్టర్ మరియు ప్రధాన జనగణన అధికారి అధ్యక్షతన ఈరోజు జిల్లా కలెక్టరేట్ నందు ఉన్నత స్థాయి సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ముఖ్య అంశాలు:

- జిల్లాలోని 28 మండలాలు, 3 రెవెన్యూ డివిజన్ల పరిధిలో పరిపాలనా సరిహద్దు పటాలను తుది ఖరారు చేయడం. - ప్రతి రెవెన్యూ గ్రామం మరియు పట్టణ వార్డుల వారీగా ఖచ్చితమైన ప్రాథమిక జనాభా గణన సారాంశం మరియు మౌలిక సదుపాయాల గణాంకాల సంకలనం. - డీసీహెచ్ఎస్ లోని పార్ట్-ఎ (గ్రామ ఉ పట్టణ డైరెక్టరీ) మరియు పార్ట్-బి (ప్రాథమిక జనాభా సారాంశం) లలో 100% ఖచ్చితత్వం పాటించడం. - గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్య, వైద్య ఉ ఆరోగ్య, మున్సిపల్ శాఖలతో పటిష్టమైన అంతర్ విభాగ సమన్వయం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా జనగణన హ్యాండ్ బుక్ అనేది ప్రాంతీయ ప్రణాళిక మరియు సామాజిక-ఆర్థిక విధానాల అమలుకు అత్యంత కీలకమైన పత్రమని, ప్రతి తహశీల్దార్ మరియు మున్సిపల్ కమిషనర్ తమ పరిధిలోని సమాచారాన్ని వ్యక్తిగతంగా ధృవీకరించి, నిర్దేశించిన గడువులోగా సమర్పించాలని ఆదేశించారు.

బి.ఎఫ్.టి.లతో ఎం-బుక్ పనులు చేయిస్తున్న వైనం.

దొరవారిసత్రం మండలంలో విధుల విభజన. సాంకేతిక రికార్డుల నిర్వహణపై ప్రశ్నలు.

దొరవారిసత్రం, సెప్టెంబర్ 3, మహి న్యూస్: వివిజిరాంజి పథకం అమలులో పారదర్శకత, సాంకేతిక ప్రమాణాలు, రికార్డుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలో ఇందుకు విరుద్ధంగా వ్యవహారం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బి.ఎఫ్.టి.లతో ఎం-బుక్‌కు సంబంధించిన పనులు చేయిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సాంకేతిక సహకారం అందించేందుకు బి.ఎఫ్.టి. వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, పథకంలోని సాంకేతిక పనులు, కొలతలు, అంచనాలు, ఎం-బుక్ వంటి కీలక రికార్డుల నిర్వహణలో సంబంధిత సాంకేతిక సిబ్బంది పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. అయితే దొరవారిసత్రం మండలంలోని కొన్ని పంచాయతీలకు సరిపడా సాంకేతిక సహాయకులు అందుబాటులో లేకపోవడంతో వారి పనుల భారం కూడా బి.ఎఫ్.టి.లపై పడుతోందన్న సమాచారం స్థానికంగా వినిపిస్తోంది.

రూ.13వేల వేతనంతో రూ.30వేల వేతన ఉద్యోగి విధులు.

బి.ఎఫ్.టి.లకు నెలకు సుమారు రూ.13 వేల మేర వేతనం ఉండగా, సాంకేతిక సహాయకుల వేతనం దాదాపు రూ.30 వేల వరకు ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఉద్యోగి చేయాల్సిన సాంకేతిక, రికార్డు సంబంధిత పనులను మరొక కేటగిరీ ఉద్యోగులతో చేయించడం నిబంధనలకు అనుగుణమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎం-బుక్‌లో నమోదు చేసే వివరాలు, పనుల కొలతలు, పూర్తి చేసిన పనుల ధృవీకరణ, సంబంధిత సాంకేతిక రికార్డులు వంటి అంశాల్లో ఎవరి బాధ్యత ఏమిటని అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఎం-బుక్‌లను వాస్తవంగా ఎవరు రాస్తున్నారు, కొలతలు ఎవరు నమోదు చేస్తున్నారు, ఏ అధికారి వాటిని పరిశీలిస్తున్నారు, చివరగా ఎవరి ధృవీకరణతో చెల్లింపులు జరుగుతున్నాయి అన్న అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు అంటున్నారు.

చాలా కాలంగా ఇదే పరిస్థితి కొనసాగింపు.

స్థానికంగా అందుతున్న సమాచార ప్రకారం ఈ విధానం ఒక్కరోజు లేదా కొద్దికాలం వ్యవహారం కాదని, ఎంతోకాలంగా కొనసాగుతోందని, అయితే ఏ పంచాయతీల్లో బి.ఎఫ్.టి.లు సాంకేతిక సహాయకుల విధులు నిర్వహిస్తున్నారు, ఎన్ని ఎం-బుక్‌లకు సంబంధించి వారు పని చేశారు అనే అంశాలపై అధికారికంగా విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై తిరుపతి జిల్లా ద్వామా అధికారులు స్పందించి మండలంలోని పంచాయతీల వారీగా సిబ్బంది కేటాయింపులు, విధుల విభజన, ఎం-బుక్‌ల నిర్వహణ, కొలతల నమోదు, ధృవీకరణ తదితర అంశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com

సగుటూరు చెరువు కట్టపై కలప మాయం

రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు

ఓజిలి, సెప్టెంబర్ 3, మహి న్యూస్: తిరుపతి జిల్లా ఓజిలి మండలం సగుటూరు పెద్ద చెరువు కట్టపై ఉన్న విలువైన కంపకర్ర మాయమైన వ్యవహారంపై పంచాయతీ, ఇరిగేషన్ అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టత రాకపోవడంతో రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు వెళ్ళినట్లు సమాచారం. చెరువు కట్టపై ఉన్న కలపను ఎవరు తొలగించారు, దాని విలువ ఎంత, తొలగించిన కలప ఎక్కడికి తరలించారు, వేలం నిర్వహించారా, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం జమ చేశారా, అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు కూడా ఓజిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. సరైన చర్యలు లేకపోతే త్వరలో హైకోర్టును కూడా ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫిర్యాదుదారులు చెప్తున్నారు.

మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసిన కారీరిష్టి యాగం

తిరుమల,సెప్టెంబర్ 3,మహి న్యూస్ : తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం ఐదు రోజుల పాటు టీటీడీ నిర్వహించిన కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి హోమాలు గురువారం మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని కారీరిష్టి, వరుణ జపం, పర్జన్యశాంతి మంత్రాలను పఠించి అందరితో పలికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీవారి దివ్య అనుగ్రహంతో భారతదేశవ్యాప్తంగా సకాలంలో సస్యాను కూలమైన వర్షాలు కురిసి, అతివృష్టి, అనావృష్టి బాధలు లేకుండా ప్రజలందరూ మంచి పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అనుసరించి ఈ యాగాలను నిర్వహించినట్లు తెలిపారు. గత ఐదు రోజులుగా 32 మంది ఋత్విక్కులతో కారీరిష్టి సహిత వరుణ జపం, పర్జన్యశాంతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి, మహాపూర్ణాహుతితో సంపూర్ణం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భాను ప్రకాష్ రెడ్డి, శాంతా రామ్, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిసెప్షన్ విభాగంపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల ,సెప్టెంబర్ 3,మహి న్యూస్: ఈ నెల 15 నుండి 23వ తేది వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి గదుల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య ఆదేశించారు. గురువారం తిరుమలలోని సుధర్మ సమావేశ మందిరంలో రిసెప్షన్ విభాగంపై అదనపు ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గదులకు మరమ్మతులు ఏవైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవ విధులకు డిప్యూటేషన్ పై వచ్చే సిబ్బందికి వసతి కేటాయించేందుకు వీలుగా తిరుమలలోని మఠాలు, కర్ణాటక సత్రాల్లోని 60 శాతం గదులను బ్రహ్మోత్సవ రోజుల్లో టీటీడీ రిసెప్షన్ విభాగం నియంత్రణలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఇన్ చార్జ్ ఐటీ జీఎం వేంకటేశ్వర్లు నాయుడు, రిసెప్షన్ ఓఎస్డీ సత్రే నాయక్, ఏఈఓ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 12న తిరుపతిలో జాతీయ లోక్ అదాలత్

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 3: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన తిరుపతిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం. గురునాథ్ తెలిపారు. గురువారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ, ప్రజలు తమ వివాదాలను త్వరితగతిన, సామరస్యపూర్వకంగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, కోర్టును ఆశ్రయించకముందే పరిష్కరించుకునే ప్రీ-లిటిగేషన్ వివాదాలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.

పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులు

సివిల్ కేసులు, రాజీకి అనువైన క్రిమినల్ కేసులు

చెక్ బౌన్స్ కేసులు

మోటారు వాహన ప్రమాద పరిహార (వీఐఆర్) కేసులు

కుటుంబ, కార్మిక వివాదాలు

బ్యాంకు రికవరీ కేసులు

విద్యుత్, నీటి బిల్లులకు సంబంధించిన వివాదాలు

లోక్ అదాలత్‌లో ఇరు పక్షాల అంగీకారంతో పరిష్కరించిన కేసులో వెలువడే అవార్డు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైనదని, దానిపై సాధారణంగా అప్పీల్‌కు అవకాశం ఉండదని తెలిపారు. అలాగే, కోర్టు ఫీజు చెల్లించిన కేసుల్లో నిబంధనల ప్రకారం ఆ ఫీజును తిరిగి చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కావున, తిరుపతి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల కక్షిదారులు, అలాగే ప్రీ-లిటిగేషన్ వివాదాలు ఉన్న ప్రజలు జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సత్వరమే పరిష్కరించుకోవాలని వారు కోరారు. జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు, మూడవ అదనపు జిల్లా జడ్జి విజ్ఞప్తి చేశారు.

టీబీ రోగులకు పోషకాహారం పంపిణీ

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 3 : టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ప్రకాశం రోడ్డు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్ 20 మంది పేద టిబి రోగులకు ఒక్కొక్కరికి 800 రూపాయల విలువ చేసే కందిపప్పు, వంటనూనె, వేరుశనగింజలు, రాగి పిండి, గోధుమపిండి ,శనగ బేడలు, హార్లిక్స్ వంటి పోషకాహారాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ మహేష్ యాదవ్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద టీ బి రోగులకు పోషకాహారం సరఫరా చేయాలని కోరారు. జిల్లా లెప్రసీ మరియు టిబి అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ టీబీ రోగులకు మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందజేస్తారని ,వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడినట్లయితే టీబీ వ్యాధి పూర్తిగా నయమవుతుందని, నిశ్చయపోషణ్ కింద టిబి మందులు వాడుతున్న ఆరు నెలల కాలానికి పోషకాహారం కొరకు ప్రతినెల 1000 రూపాయలు వారి అకౌంట్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీధర్, రుయా హాస్పిటల్ పల్మనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారావు ,ప్రకాశం రోడ్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, టిబి విభాగం సిబ్బంది లోకేష్, మురళి ,మోహిద్దిన్, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

గిరిజనులకు ఇచ్చిన భూములు ఎక్కడ..!

తిరుపతి, సెప్టెంబర్ 3, మహి న్యూస్: తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ తెగలకు చెందిన వేలాది కుటుంబాల అభివృద్ధి కొరకు గతంలో ప్రభుత్వం భూములు కేటాయించి, సాగు చేసుకొమని చెప్పడం జరిగింది. కానీ నేడు ఎక్కువశాతం అట్టి భూములు వారి ఆధీనంలో లేవని తెలుస్తుంది. జిల్లలో షెడ్యూల్డ్ తెగల మెజారిటీ ప్రజలు ఇప్పటికీ సమాజానికి దూరంగా, పేదరికం, భూ రహితత్వంతో జీవిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గిరిజన గ్రామీణ అభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లాలో పటిష్టమైన ప్రణాళికలను అమలు చేయడంలో పూర్తి స్థాయి వైఫల్యం చెందిందని స్పష్టమవుతోంది. భారతదేశంలో షెడ్యూల్డ్ తెగల భూ హక్కుల కోసం బలమైన చట్టాలు ఉన్నప్పటికి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ఏరియాల ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములను ఇతర కులాలకు బదిలీ చేయడం నిషేధం. 1997 సుప్రీంకోర్టు సమతా తీర్పు కూడా ప్రభుత్వ భూములను కూడా నాన్-ట్రైబల్స్‌కు ఇవ్వకూడదని స్పష్టం చేసింది. అయినా రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల గిరిజన భూములు ఆక్రమణలకు గురవుతూనే ఉన్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 4.65 లక్షల కేసులు, 9.17 లక్షల ఎకరాల భూమి గిరిజనుల నుంచి వేరు చేయబడిందని సమాచారం. అందులో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక భాగం ఉందని, అనేక కేసుల్లో కోర్టు ఆదేశాలు వచ్చినా భౌతిక స్వాధీనం జరగడం లేదు.

కష్టాల ఫలితంగా కోల్పోయిన భూములు.

తిరుపతి జిల్లాలోని గిరిజన సమూహాలు యానాది, యెరుకల కూడా ఇదే విధంగా నష్టపోయాయి. ప్రభుత్వం భూములు కేటాయించినప్పుడు పట్టాలు ఇచ్చినట్లు చెప్పినా, సర్వే నంబర్లు తప్పుగా ఉండటం, రికార్డులు అసంపూర్ణంగా ఉండటం, అధికారుల నిర్లక్ష్యం, స్థానిక ప్రభావవంతుల ఒత్తిడి వల్ల ఆ భూములు కాలక్రమేణా ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కొన్ని సోట్ల అసైన్డ్ భూములను అక్రమంగా అమ్ముకోవడం, ఋణాల కారణంగా కోల్పోవడం, లేదా అభివృద్ధి పథకాల పేరిట స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఫలితంగా ఒకప్పుడు భూమి సాగు చేసుకుని జీవనోపాధి పొందాలనుకున్న కుటుంబాలు నేడు భూమి లేకుండా, రోజువారీ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నాయి. గిరిజన గ్రామీణ అభివృద్ధి సంస్థలు, ఐటీడీఏలు, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలు ఎన్నో ప్రణాళికలు, నిధులు ప్రకటించినప్పటికి, అవి తిరుపతి జిల్లాలో అవి కాగితాలపైనే మిగిలిపోయాయని ప్రజలలో తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. భూ రికార్డుల డిజిటలైజేషన్, రీసర్వేలు జరుగుతున్నప్పటికీ, ఎస్టీలు వారి హక్కులను నిలబెట్టుకోలేకపోతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం, అవినీతి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

గణాంకాలలో కనిపిస్తున్న గిరిజనుల వెనుకబాటు.

షెడ్యూల్డ్ తెగలలో ఎక్కువ మంది ఇప్పటికీ భూమి రహితులు లేదా చాలా తక్కువ భూమి కలిగి ఉన్నారు. వారి జీవన ప్రమాణాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు ప్రధాన సమాజం నుంచి చాలా వెనుకబడి ఉన్నాయి. ప్రభుత్వం "అభివృద్ధి" పేరిట భూములు కేటాయిస్తూ, తరువాత వాటిని రక్షించలేకపోవడం అనేది కేవలం పరిపాలనా వైఫల్యమీ కాక సామాజిక న్యాయం పట్ల నిర్లక్ష్యం అని చెప్పవచ్చు. తిరుపతి జిల్లా కలెక్టరేట్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ, రెవెన్యూ శాఖ వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, జిల్లావ్యాప్తంగా అన్నీ మండలాల్లో గతంలో కేటాయించిన భూముల స్థితిని తేల్చాల్సిన అవసరం ఉంది. అక్రమంగా వేరు చేయబడిన భూములను తిరిగి గిరిజనులకు అప్పగించాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే. ఆక్రమణలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. గిరిజనులు కేవలం ఓటు బ్యాంకులు కాదని, వారికి న్యాయం, భూమి, గౌరవం అవసరమని, జిల్లా యంత్రాంగం దీనిపై దృష్టి పెట్టాలని గిరిజన నాయకులు కోరుతున్నారు.

వాకాడు పంచాయతీలలో 'పన్నుల' గోల్‌మాల్

పంచాయితీ అధికారుల దాగుడుమూతలు.

బాధ్యులపై చర్యలకు ప్రజల డిమాండ్.



వాకాడు, సెప్టెంబర్ 3, మహి న్యూస్: తిరుపతి జిల్లా వాకాడు మండల గ్రామ పంచాయతీలలో ప్రజాధనానికి రక్షణ లేకుండా పోతోంది. మండల పరిధిలోని కల్లూరు, ముట్టెంబాక పంచాయతీలలో 2019 నుండి 2023 వ సంవత్సరాల మధ్యకాలంలో ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్నులు, వాణిజ్య పన్నుల లెక్కల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కష్టపడి సంపాదించిన సొమ్మును పన్నుల రూపంలో పంచాయతీకి చెల్లిస్తే, ఆ సొమ్ము అధికారుల, ప్రజాప్రతినిధుల జేబుల్లోకి వెళ్లిందా అనే సందేహాలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

తప్పుడు లెక్కలు,రికార్డుల్లో తీవ్ర వ్యత్యాసాలు.

గత ఐదేళ్ల కాలంలో కల్లూరు, ముట్టంబాక గ్రామాల్లో వందలాది ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి లక్షల రూపాయలు పన్నులు పంచాయితీ అధికారులు వసూలు చేయడం జరిగింది. అయితే, ఆ మొత్తాన్ని పంచాయతీ ఖాతాల్లో జమ చేయడంలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నట్లు రికార్డులే చెప్తున్నాయి. అసలు వసూలైన మొత్తమెంత, ప్రభుత్వ ఖాతాకు చేరిందెంత, అనే విషయమై అధికారులు చూపుతున్న తప్పుడు లెక్కలు ప్రస్తుతం అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రజాధనం భారీగా పక్కదారి పట్టిందని, రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసి నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డిప్యూటీ ఎంపీడీవో నిమ్మకు నీరెత్తిన వైఖరి.

ఈ అక్రమాలపై వాస్తవాలు బయటకు తీసి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన వాకాడు మండల డిప్యూటీ ఎంపీడీవో ఏమాత్రం స్పందించకపోవడం పలు అనుమానాలకు బలం చేకూరుస్తోంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, పన్నుల గోల్‌మాల్‌పై వివరణ ఇవ్వాలని కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం వెనుక అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల విధానాలు చూస్తుంటే ఈ నిధుల దుర్వినియోగంలో ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందా అన్న కోణంలో చర్చ నడుస్తోంది.

పాత, కొత్త అధికారులపై చర్యలు తీసుకోవాలి.

2019 నుండి 2023 వరకు పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో పాటు, ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్న అధికారులు కూడా ఈ అవకతవకలకు పూర్తి బాధ్యత వహించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన వారిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించి, నిధులను రికవరీ చేయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరిస్తున్నారు. లేనిపక్షంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

రీ--సర్వే పనుల్లో మండల సర్వేయర్లు పూర్తి అవగాహనతో పనిచేయాలి

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబరు 03 : జిల్లాలో జరుగుతున్న రీ--సర్వే పనులను నిర్దేశిత గడువులో, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మండల సర్వేలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో' ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ పుల్లారెడ్డి, సర్వేర్ ఏడి పుల్లయ్య గురువారం ఉదయం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మండల సర్వేయర్లతో రీ - సర్వే పై ప్రత్యేకంగా సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రీ--సర్వేలో ఫేజ్--4, ఫేజ్--5, ఫేజ్--6 కింద చేపడుతున్న పనుల పురోగతిపై మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... రీ సర్వే జరుగుతున్న గ్రామాలలో రైతులకు ముందుగా నోటీసులు అందజేసి రైతుల సమక్షంలో రీ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రీ--సర్వే పనులపై మండల సర్వేయర్లకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని, తమ పరిధిలోని ప్రతి గ్రామంలో ఎంత మేరకు పని పూర్తయింది, ఏ దశలో ఉంది, ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటి, ఎదురవుతున్న సమస్యలు ఏమిటి అనే అంశాలపై స్పష్టమైన సమాచారం కలిగి ఉండాలని సూచించారు. కేవలం గ్రామ సర్వేయర్ల నుంచి సమాచారం తీసుకుని సమీక్షల్లో తెలియజేయడం సరికాదని, మండల సర్వేయర్లు స్వయంగా పనులను పర్యవేక్షించి పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. గ్రామ సర్వేలతో ప్రతిరోజు రీ సర్వేపై సమీక్షించాలని ఆదేశించారు, రీ--సర్వేకు సంబంధించిన లిఎస్ఓపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)లిపై మండల సర్వేయర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి దశను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్ (జీటీ), వెరిఫికేషన్ (వీఆర్), ఇతర ప్రక్రియలకు సంబంధించిన కాలపరిమితులు, రోజువారీగా పూర్తి చేయాల్సిన పనుల లక్ష్యాలు తదితర అంశాలపై స్పష్టత ఉండాలని తెలిపారు. ప్రతి మండలంలో రీ--సర్వేకు సంబంధించిన మూడు, నాలుగు లేదా అంతకంటే ఎక్కువ గ్రామాల్లో జరుగుతున్న పనులపై మండల సర్వేయర్‌కు పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉండాలని, ప్రతి గ్రామం వారీగా పురోగతిని నమోదు చేసుకుని సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీ--సర్వేలో గతంలో జరిగిన తప్పిదాల కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం చేపడుతున్న రీ--సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. భూమి ప్రజలకు అత్యంత కీలకమైన ఆస్తి అని, కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వివాహాలు, వైద్య అత్యవసర పరిస్థితులు, రుణాలు తదితర అవసరాలకు భూమి ఆధారంగా ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల రీ--సర్వేలో చిన్న పొరపాటు జరిగినా దాని ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉంటుందని అధికారులు గుర్తించాలని సూచించారు.

రీ--సర్వేకు సంబంధించిన సమస్యలను మండల, తాలూకా స్థాయిలోనే సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఒక అధికారి ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోతే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఇకపై రీ--సర్వే పనులపై ప్రతి నెలా మండల సర్వేయర్లు, వీఆర్వోలు/సంబంధిత అధికారులతో ప్రత్యేక భౌతిక సమావేశం నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్‌లలోనూ రీ--సర్వే పురోగతిపై గ్రామాల వారీగా, అధికారి వారీగా వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. రీ-సర్వే 4, 5, 6 దశల పురోగతి, షేప్‌ఫైల్ సవరణలు, జీటీపై ఈ-కేవైసీ, 7వ దశ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. 4వ దశ రీ-సర్వేలో గ్రామాల వారీగా డేటా ఎంట్రీ, వీఆర్వో లాగిన్, తహసీల్దార్ లాగిన్, ఆర్డీఓ లాగిన్, జాయింట్ కలెక్టర్ లాగిన్, డీఎల్ఆర్ ఆమోదం తదితర దశల్లో ఉన్న పనుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న డేటా ఎంట్రీలను వేగవంతంగా పూర్తి చేసి తదుపరి దశలకు పంపాలని సూచించారు. అదేవిధంగా 5వ దశ రీ-సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ (జీటీ), వెక్టరైజేషన్, ఏరియా--కోరిలేషన్ ప్రక్రియలు ఏ దశలో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేలు తదితరులు పాల్గొన్నారు. ప్రతి మండల సర్వేయర్ తన పరిధిలోని ప్రతి గ్రామానికి సంబంధించిన పనులపై పూర్తి అవగాహనతో ఉండాలని, నిర్దేశిత ఎస్ఓపీ ప్రకారం పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు

తిరుపతి జిల్లా డీసీసీ మరియు డీఎల్ఆర్సీ సమావేశం

విద్యా రుణాలు ప్రాధాన్యతగా తీసుకొని బ్యాంకర్స్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలి.

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 03 : గురువారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు (డీసీసీ) జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం జూన్ త్రైమాసికం ఆర్థిక సంవత్సరం 2026-27, చైర్మన్ హోదాలో జిల్లా జాయింట్ , ఆర్బిఐ ఎల్డీఓ పల్లెర్ల యల్లమంద ,నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం గుంటూరు రవి కుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మ , వివిధ బ్యాంకు అధికారులుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు మాట్లాడుతూ ..అన్ని బ్యాంకులను రివ్యూ చేశారు . సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమల రుణాలు బాగా ఇవ్వాలని ఆదేశించారు.తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. అన్ని విద్యాలయాల్లో విద్యా రుణాలకు సంబంధించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని. రుణాల మంజూరు శాతం పెంచాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్సు కంపల్సరీ చెయ్యాలని ఆదేశించారు .పి ఎం ఈ జి పి పథకం రుణాలు మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాల మంజూరు విషయంలో వెనకబడి ఉన్నాయని ఎలాంటి జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లందరూ రుణాల మంజూరు లో నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వము ఎన్టీఆర్ భరోసా పథకమును ప్రాధాన్యతగా తీసుకుంటుందని,జిల్లాలో ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీల పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

4న కృష్ణాష్టమి - గోపూజ

మన వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం

గోవు సకల దేవతలకు ఆవాసస్థానం కావడం చేత గోవును పూజించడం వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుంది

శ్రీశైలం, మహి న్యూస్, సెప్టెంబర్ 03 : సెప్టెంబరు 4వ తేదీన కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయప్రాంగణంలో విశేషంగా గోపూజ నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 4 తేదీ ఉదయం గం.9.30ని.ల నుండి ఆలయ ప్రాంగణంలోని 'శ్రీగోకులం' వద్ద గోవులకు, గోవత్సములకు (దూడలకు) శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడుతాయి. అదేవిధంగా గో సంరక్షణశాలలో కూడా విశేషంగా గోపూజ జరిపించబడుతుంది. మన వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉంది. మన వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు మొదలైనవన్నీ కూడా గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొన్నాయి. గోవు సకల దేవతలకు ఆవాసస్థానం కావడం చేత గోవును పూజించడం వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా గోపూజను ఆచరించడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా జగన్నాథ లలితాపరమేశ్వరి గోవురూపంలో భూమిపై సంచరిస్తుందని చెబుతారు. కాగా తాను చేసిన ప్రతిపనిలోనూ వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీ కృష్ణపరమాత్మ అవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోకులంగా పేరొందిన వ్రేపల్లెలో పెరిగి, గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి, గోవుయొక్క అనంత మహిమ

మందుల కోసం భారీ క్యూ.. రోగుల అవస్థలు!

కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల పంపిణీ కేంద్రం వద్ద భారీగా రద్దీ

కర్నూలు, సెప్టెంబర్ 3: (మహి న్యూస్): కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల కోసం రోగులు, వారి సహాయకులు భారీ సంఖ్యలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యులను సంప్రదించి మందుల చీటీ తీసుకున్న అనంతరం మందులు పొందేందుకు రోగులు మందుల పంపిణీ కేంద్రం వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో మందుల కౌంటర్ వద్ద భారీ క్యూ ఏర్పడి, గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది. అనారోగ్యంతో ఉన్న వృద్ధులు, మహిళలు, చిన్నారులతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా మందుల పంపిణీ కౌంటర్లను పెంచడంతో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి, వేగంగా మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందుల కోసం రోగులు గంటల తరబడి నిరీక్షించకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమల భద్రత, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, మాక్ డ్రిల్స్ నిర్వహణపై జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాల అమలును ఫ్యాక్టరీస్ శాఖ అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. సెప్టెంబర్ నెలాఖరులోపు ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర పరిశ్రమల నుంచి అత్యవసర ప్రణాళికలను సేకరించినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. పరిశ్రమలు తమ అత్యవసర ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీ.పీ.ఈ.) కార్మికులకు అందుబాటులో ఉంచడంతో పాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్మికులకు భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై నిరంతరం శిక్షణ అందించాలని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామిక భద్రత, అత్యవసర పరిస్థితుల సమర్థవంతమైన నిర్వహణకు అన్ని శాఖలు, పరిశ్రమల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ రెడ్డి జిల్లాలోని కర్మాగారాల పరిస్థితిపై వివరాలను సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా రవాణా శాఖ అధికారి శాంతి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలి

పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి.. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి, సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి టూరిజం అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పర్యాటక రంగ పురోగతిపై పర్యాటక కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రాలయం దేవాలయం సమీపంలో చేనేత ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని చేనేత అధికారులను ఆదేశించారు. చిన్నతుంబలం చెరువు, నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లె ఎల్లమ్మ తదితర ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, మౌలిక వసతులు కల్పించేలా అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అదేవిధంగా జగన్నాథ గట్టు, బ్రహ్మగుండం, ఉరుకుంద, కేతవరం తదితర పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన లీజు ప్రక్రియను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా జిల్లాకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో టూరిజం అధికారి తిరుమల నాయుడు, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎస్ఈ మల్లికార్జున రెడ్డి, డ్వామా ఏపీడీ మాధవీలత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏపీటీడీసీ ఈఈ శివ నాగేశ్వరరావు, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై

ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్



కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల జారీ, విచారణ ప్రక్రియతో పాటు ఫారం--6 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్హత కలిగిన యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఫారం--6 దరఖాస్తులు సమర్పించి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఫారం--7, 8 దరఖాస్తుల పెండెన్సీని కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. అర్హత లేనివారిగా గుర్తించిన వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వారికి ఫారం--7 జనరేట్ చేయనున్నట్లు తెలిపారు. ఫారం--6, 7, 8లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ రానున్న వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్వీఎస్‌పీ, బుక్ ఏ కాల్స్‌లో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సి. వెంకటనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, దాతలను భాగస్వాములను చేయాలి

పదో తరగతి ఫలితాల్లో కనీసం 10 శాతం మెరుగుదల సాధించాలి

మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విద్యార్థులకు మంచి నడవడిక, క్రమశిక్షణ నేర్పించాలి

సానుకూల ప్రజాభిప్రాయంపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, దాతలను భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు డివిజన్‌కు చెందిన ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల అభివృద్ధి, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, సానుకూల ప్రజాభిప్రాయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అవసరానికి ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా దాతలు, పూర్వ విద్యార్థుల సహకారం పొందాలని సూచించారు. చిన్నపాటి మరమ్మతులు, బెంచీలు, క్రీడా సామగ్రి, తాగునీటి సదుపాయాల కోసం దాతలను ప్రోత్సహించాలని తెలిపారు. డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, దాతలను అనుసంధానం చేసి పాఠశాలల అభివృద్ధికి వారి సహకారం పొందాలని సూచించారు.

పదో తరగతి ఫలితాల్లో 10 శాతం మెరుగుదల లక్ష్యం

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని కనీసం 10 శాతం పెంచే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం సమీక్షిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు సందేహ నివృత్తి తరగతులు నిర్వహించాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్ వంటి అంశాల్లో విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరచాలని, ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, విద్యార్థులతో వారి సంబంధాలపై ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, పౌష్టికమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్నం, కూరలు, సాంబారు తదితర ఆహార పదార్థాల నాణ్యతను నిరంతరం పరిశీలించాలని సూచించారు. సక్రమంగా వంట చేయని వంట సిబ్బందిని మార్చాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాల్లో వెనుకబడిన పాఠశాలలను గుర్తించి ప్రత్యేకంగా సమీక్షిస్తామని తెలిపారు. పాఠశాలల పరిసరాలు, తరగతి గదులను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని, ఈ నెలలోగా పాఠశాల ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.

విద్యార్థుల్లో మంచి నడవడిక పెంపొందించాలి

విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఆత్మవిశ్వాసం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పించడంతో పాటు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యక్తిగత భద్రత, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

సానుకూల ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత

ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సేవలు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం కల్పించేలా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సానుకూల ప్రజాభిప్రాయ సూచీలో జిల్లాను 15వ ర్యాంకులోపు తీసుకురావడానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

బాల్య వివాహాల నిర్మూలనకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 9, 10వ తరగతి విద్యార్థినులకు బాల్య వివాహాలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలని సూచించారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలకు దూరం కాకుండా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బాలికల విద్యను కొనసాగించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. సుధాకర్, సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, భోజన నాణ్యతపై రాజీ పడొద్దు

వార్డెన్లు, వంట సిబ్బందికి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

సెప్టెంబర్ నెలాఖరులోగా సోక్‌పిట్లు, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అన్ని సంక్షేమ విభాగాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో సంక్షేమ శాఖల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలను తరచూ తనిఖీ చేస్తానని, తనిఖీల్లో లోపాలు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వార్డెన్లు, వంట సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు, గదులు, ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత వార్డెన్లు, సిబ్బందిపై ఉందన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు తల్లిదండ్రుల మాదిరిగా సంరక్షణ, ఆప్యాయత అందించాలని సూచించారు. ఎంఈఓలు, ఎంపీడీఓలు, సహాయ బీసీ సంక్షేమ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఈ విద్యా సంవత్సరంలో గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతాన్ని కనీసం 15 శాతానికి పైగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాల్లో తాగునీటి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని, మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్నం సక్రమంగా ఉడికించడంతో పాటు విద్యార్థులందరికీ సరిపడా పరిమాణంలో భోజనం అందించాలని సూచించారు. భోజన బిల్లులు, ఖర్చులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిమాణం, నాణ్యతను సరిపోల్చి పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. నాసిరకం భోజనం అందిస్తూ బిల్లులు పొందుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డెన్లు, సంబంధిత సిబ్బంది తమకు కేటాయించిన ప్రధాన కార్యాలయాల్లోనే నివాసం ఉండేలా చూడాలని ఆదేశించారు. వసతి గృహాల్లో సోక్‌పిట్లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, మొక్కల పెంపకం పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ నరసింహ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

100 శాతం ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి

ఈ-ఆటోల డ్రైవర్లకు కమిషనర్ చల్లా ఓబులేసు సూచనలు

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎలక్ట్రిక్ ఆటోలను సమర్థవంతంగా వినియోగిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు డ్రైవర్లకు సూచించారు. గురువారం విశాల్ మార్ట్ సమీపంలోని ఈ-ఆటోల ఛార్జింగ్ స్టేషన్ వద్ద ఈ-ఆటోల పార్కింగ్, చెత్త బదిలీ కేంద్రం, ఛార్జింగ్ పాయింట్ల పనితీరును పరిశీలించి డ్రైవర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన డ్రైవర్లు నగరపాలక సంస్థ కుటుంబంలో సభ్యులని, విధుల్లో బాధ్యత, నిబద్ధతతో పనిచేయడం ఎంతో అవసరమన్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ-ఆటోల నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఏజెన్సీ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని కమిషనర్ తెలిపారు. వాహనాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ చెత్త సేకరణకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, నరేష్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్ మునిస్వామి, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం

మృతి చెందిన హోంగార్డు భార్యకు నియామక ఉత్తర్వుల పత్రం అందజేత

ఉత్తర్వుల పత్రం అందజేసిన ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. కృష్ణమోహన్

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): కర్నూలు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించారు. హోంగార్డు కె. కృష్ణ 2026 ఏప్రిల్ 18న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య కె. సునీతకు కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం కల్పిస్తూ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. కృష్ణమోహన్ సునీతకు హోంగార్డు ఉద్యోగ నియామక ఉత్తర్వుల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచే ఉద్దేశంతో కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఏఆర్ఎస్ఐ ఎస్.ఎల్. కాంతారెడ్డి, హోంగార్డ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో మౌలిక వసతుల

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ర్యాంప్ నిర్మాణానికి ప్రాధాన్యత.. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 03: (మహి న్యూస్): కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి కేంద్రీయ విద్యాలయ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతుల మెరుగుదల కోసం నిర్వహణ, మరమ్మతుల కింద మంజూరైన పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సులభంగా రాకపోకలు సాగించేందుకు గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తు వరకు ర్యాంప్ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, ర్యాంప్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు కీలకమైనవని తెలిపారు. వీటికి హెడ్‌క్వార్టర్స్ నుంచి త్వరితగతిన అనుమతులు పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలు, సిఫార్సులు సమర్పించి ఫాలోఅప్ చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో 2 నుంచి 3 ఎకరాల ఖాళీ స్థలం ఉందని, మైదానం పరిసరాలను శుభ్రం చేసినప్పటికీ పెద్ద రాళ్లు ఉండటంతో విద్యార్థులు ఆటలు ఆడుకోలేకపోతున్నారని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మైదానం అభివృద్ధికి నగరపాలక సంస్థ కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల హైవే సమీపంలో ఉన్నందున విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇద్దరు పోలీసులను కేటాయించాలని ప్రిన్సిపల్ కోరగా, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ ప్రియదర్శిని మాట్లాడుతూ నిర్వహణ, మరమ్మతుల కింద మంజూరైన పనుల్లో రూఫ్ వాటర్‌ప్రూఫింగ్ పూర్తయిందని, ఫ్లోర్ ట్రీట్‌మెంట్ పని 85 శాతం పూర్తయిందని తెలిపారు. రోడ్డు పనికి కూడా మంజూరు లభించిందని, మిగిలిన పనులకు ప్రాధాన్యత ఆధారంగా నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2024--25లో పీఎం శ్రీ పథకం కింద 98 శాతానికి పైగా, 2025--26లో 93.85 శాతం నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. క్రీడల్లో ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వచ్చే ఏడాది ఈ సంఖ్యను రెట్టింపు చేసే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. 10వ, 12వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సమావేశంలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ మ్యాథ్స్ టీచర్ షేక్‌షావలి, సీజీఈఈడబ్ల్యూసీసీ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ జనార్దన్ రెడ్డి, టెక్నికల్ మెంబర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

--బాలకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి

గాలివీడు/రాయచోటి: అగస్టు29(మహి న్యూస్): శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూల్ (సీబీఎస్ఈ) ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు చిన్నారుల సందడితో ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమానికి ఉమ్మడి కడప డివిజన్ ఏజీఎం డి. రమణయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాంతీయ సంచాలకులు పి. మహబూబ్ బాషా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి వారిని అభినందించారు.

బాలకృష్ణుల వేషధారణలో చిన్నారులు

విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించుకుని వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేకంగా అలంకరించి పాఠశాలకు తీసుకువచ్చారు. చిన్నారుల ఆకర్షణీయమైన వేషధారణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు, శ్రీకృష్ణుడి లీలల ఆధారంగా రూపొందించిన నాటికలు, భక్తిగీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సంప్రదాయాలపై అవగాహన

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు, వారిలో సృజనాత్మకత మరియు కళాత్మక ప్రతిభను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కళాభారతి, వైస్ ప్రిన్సిపల్ జీవానందం, పద్మ, ఇన్‌చార్జి నాగప్రియ, ఉపాధ్యాయ

బోరెడ్డిగారిపల్లిలో ప్రత్యేక గ్రామసభ

-కులాల వారీగా ఓటర్ల జాబితాపై పరిశీలన

గాలివీడు:సెప్టెంబరు03(మహి న్యూస్): గాలివీడు మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో ప్రత్యేక గ్రామసభను గురువారం నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిధిలోని కులాల వారీగా ఓటర్ల జాబితాను గ్రామసభలో పరిశీలించి, ప్రజలకు వివరాలను తెలియజేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. గ్రామసభలో ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై చర్చించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబితాలో తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది, బి ఎల్ ఓ లు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయమూర్తులతో ముందస్తు సమావేశం



కడప జిల్లా/మహి న్యూస్, సెప్టెంబర్ 3: ఈ నెల 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కడప న్యాయ విభాగ పరిధిలోని న్యాయమూర్తులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్ తన కార్యాలయ గదిలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన కేసులపై న్యాయమూర్తులతో చర్చించారు. అధిక సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం రిట్ పిటిషన్ నంబర్ 116/2024, తేదీ 26-11-2025 ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ జరిమానాలను సెప్టెంబర్ 12న జరిగే

జాతీయ లోక్ అదాలత్‌లో సంబంధిత పరిధిలోని బెంచ్ వద్ద రాజీ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎన్. శాంతి, నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి జి.ఎస్. రమేష్ కుమార్, ఆరో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. శ్రీనివాసులు నాయక్, పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి ఎం.ఎ. సోమ శేఖర్, ఏడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి టి. ప్రతిమ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ బాబా ఫక్రుద్దీన్‌తో పాటు కడప, బద్వేల్, రాయచోటి న్యాయస్థానాలకు చెందిన పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

మదనపల్లి పట్టణ తాగునీటి సమస్య

పరిష్కారానికి చర్యలు

మదనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 3 : జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మదనపల్లి పట్టణ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించుటకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లి ప్రాంతంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల సామర్థ్యాన్ని తాత్కాలికంగా పెంచాలని నిర్ణయించడం జరిగింది.

అందులో భాగంగా:

1. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ చెరువు సామర్థ్యాన్ని 30 ఎంసీఎఫ్టీ నుండి 40 ఎంసీఎఫ్టీకు 2. గుంటివారిపల్లి సమ్మర్ స్టోరేజ్ చెరువు సామర్థ్యాన్ని 40 ఎంసీఎఫ్టీనుండి 50 ఎంసీఎఫ్టీకు పెంచడానికి ప్రయత్నం చేయడం జరుగుతుంది. దీని ద్వారా మొత్తం 90 ఎంసీఎఫ్టీ నీటిని నిల్వ చేసి, మదనపల్లి ప్రజలకు వచ్చే 9 నెలల పాటు అనగా జూన్ 2027 వరకు తాగునీటి కొరత లేకుండా సరఫరా చేయడం జరుగుతుంది. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ చెరువులలో ఆఫ్ టేక్ పాయింట్ (నీటిని తీసుకునే ప్రదేశం) చెరువు ఎఫ్ఆర్ఎల్(పూర్తి నీటి నిల్వ మట్టం) కన్నా దిగువన ఉండటం వలన పూర్తి సామర్థ్యం వినియోగంలోకి రావడం లేదు. కావున చెరువులను లోతు చేసి, పూడిక తీసి అదనపు నీటిని నిల్వ చేసే విధంగా పనులు చేపట్టడం జరుగుతుంది. ట్యాంకుల్లో పెద్ద ఎత్తున నిర్మాణ వ్యర్థాలు (కన్‌స్ట్రక్షన్ డెబ్రిస్) అక్రమంగా వేయడం వల్ల తీవ్రమైన సమస్యగా మారుతోంది. ట్యాంకుల్లో చెత్త లేదా నిర్మాణ వ్యర్థాలను వేయకుండా ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. భవిష్యత్తులో ఈ ట్యాంకులు తాగునీటికి జీవనాధారంగా నిలవనున్నాయి. కాబట్టి వీటిని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత. మన విలువైన నీటి వనరులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ఇకపై నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. ఈ సమ్మర్ ట్యాంకుల్లో నిర్మాణ వ్యర్థాలు, చెత్త లేదా ఇతర వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నట్లు గుర్తించిన ఏ ట్రాక్టర్‌నైనా వెంటనే సీజ్ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. పై పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయుటకు జిల్లా యంత్రాంగం మరియు జలవనరుల శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడమైనది.

జమ్మలమడుగు రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులు..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ

డా. నిధీమీనా లతోకలిసి జమ్మలమడుగు

మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమావేశం

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 3 : జమ్మలమడుగు పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జమ్మలమడుగు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించమన్నారు. సమీక్షించారు. ప్రస్తుతం పట్టణానికి రోజుకు 7.14 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఉండగా, అంతే పరిమాణంలో సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మైలవరం, పెన్నా నదులను నీటి వనరులుగా వినియోగిస్తున్న నేపథ్యంలో నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. అమృత్ 2.0 కింద మంజూరైన తాగునీటి అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. పనులను వెంటనే ప్రారంభించి, క్షేత్రస్థాయిలో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని నీటి నిల్వ ట్యాంకులు, పైపులైన్లు, సరఫరా వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలను సరిచేయాలని సూచించారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం జమ్మలమడుగు మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.25 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, పార్కు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పట్టణంలో ప్రస్తుతం 68.23 కిలోమీటర్ల డ్రైనేజీ వ్యవస్థ మాత్రమే ఉండగా, 207.84 కిలోమీటర్ల మేర అవసరం ఉన్నందున ప్రాధాన్యతా క్రమంలో డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రోజుకు సుమారు 22 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో చెత్త సేకరణ, తరలింపు, తడి--పొడి చెత్త వేరు చేయడం వంటి ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పదార్థాల పునర్వినియోగ కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు, మురుగునీటి శుద్ధి కేంద్రం మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లు, నివాస ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పూర్తిస్థాయిలో వెలుతురు ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. అలాగే పెద్దపసుపుల రోడ్డులో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపైనా కలెక్టర్ సమీక్షించారు. ఎన్‌టీఆర్ గృహ పథకం కింద నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులతో సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. గృహ లేఅవుట్లలో నీరు, రహదారులు, డ్రైనేజీతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, దుకాణ గదుల వంటి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టణ ప్రణాళికలో భాగంగా మాస్టర్ ప్లాన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ, భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటాలని, ప్రతి మొక్కకు కుడా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరందించాలన్నారు. పట్టణ విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతిపాదించిన రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, వీధి వ్యాపారులకు అవసరమైన సహకారం అందేలా మెప్మా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, గృహ నిర్మాణం, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధి పనులన్నింటికీ స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీ పరిధితో పాటు సమీప గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చేందుకు సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. జమ్మలమడుగు జెడ్పీ మెయిన్ పాఠశాలతో పాటు తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం ఉన్నత పాఠశాలలను అన్ని సౌకర్యాలతో ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

జమ్మలమడుగు అభివృద్ధికి పూర్తి సహకారం : ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జమ్మలమడుగు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి ప్రజలకు నిత్యావసరమైన అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు, నిధుల సమీకరణలో జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు స్థానిక నాయకులు భూపేష్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, డిపివో రామకృష్ణ, రరెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, విద్యుత్, గృహ నిర్మాణ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యర్రగుంట్ల సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ..!

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ.

డా. నిధీమీనా లతోకలిసి..

యర్రగుంట్ల మున్సిపాలిటీ

అభివృద్ధి పురోగతిపై సమీక్ష

పన్ను వసూళ్లలో వంద శాతం

లక్ష్యాన్ని సాధించాలి

కడప, మహి న్యూస్ సెప్టెంబరు 3: యర్రగుంట్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ఎర్రగుంట్ల మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. యర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా సమగ్ర ప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా పన్ను వసూళ్లను మెరుగుపరచడంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రతిపాదిత పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, గృహ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో యర్రగుంట్ల మున్సిపాలిటీ ప్రస్తుత స్థితిగతులు, అభివృద్ధి పనులు, ఆదాయ వనరులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, గృహ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులు కలెక్టర్‌కు వివరాలు సమర్పించారు. 2012లో నగర పంచాయతీగా ఏర్పడిన యర్రగుంట్ల 2025లో రెండో తరగతి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను బలోపేతం చేయడంలో భాగంగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను తదితరాల వసూళ్లపై కలెక్టర్ సమీక్షించారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆస్తి పన్ను వసూళ్లు 26.56 శాతంగా ఉండగా, ప్రైవేటు ఆస్తుల పన్ను వసూళ్లు 39.69 శాతానికే పరిమితమవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పన్ను బకాయిలను గుర్తించి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు. యర్రగుంట్ల పట్టణానికి భవిష్యత్ అవసరాలకు సరిపడా తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించిన రూ.139.68 కోట్ల ఏఐఐబీ పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. గండికోట వద్ద నీటి సేకరణ బావి, రోజుకు 80 లక్షల లీటర్ల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రం, మూడు ఎత్తిపోతల నీటి నిల్వ కేంద్రాలు, 42.22 కిలోమీటర్ల ప్రధాన నీటి పైపులైన్ తదితర పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకు అవసరమైన భూముల కేటాయింపు అంశాలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణంలోని రహదారుల పరిస్థితిపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. గుర్తించిన 60 గుంతలను రూ.4.30 లక్షల వ్యయంతో చేపడుతున్న మరమ్మతులను వెంటనే పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కొనసాగుతున్న 28 రహదారి పనులు, 13 డ్రైనేజీ పనులు, 28 నీటి సరఫరా పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి హామీ కింద ప్రతిపాదించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా, కమ్యూనిటీ హాల్, నీటి ప్లాంట్ తదితర రూ.13 కోట్ల పనులను కూడా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని తెలిపారు. పట్టణంలో రోజుకు సుమారు 16 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కడప రోడ్డు డంప్‌యార్డులో పేరుకుపోయిన 6,227 టన్నుల పాత చెత్తను జీవశుద్ధి ప్రక్రియ ద్వారా తొలగించే పనులను వేగవంతం చేయాలని సూచించారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా చేపడుతున్న శస్త్రచికిత్సల ప్రక్రియను కూడా నిబంధనల మేరకు కొనసాగించాలని తెలిపారు. టిడ్కో కింద నిర్మించిన 1,584 ఇళ్లలో 1,448 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రకాశ్‌నగర్ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 1,154 ఇళ్లలో 278 ఇళ్లు పూర్తికాగా, మరో 876 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రహదారులు, మురుగునీటి పారుదల, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

యర్రగుంట్లలో 656 స్వయం సహాయక సంఘాల్లో 6,230 మంది సభ్యులు ఉన్నట్లు అధికారులు వివరించారు. బ్యాంకు అనుసంధానం ద్వారా మహిళా సంఘాలకు అందుతున్న రుణాలపై కలెక్టర్ సమీక్షించి, అర్హులైన మరిన్ని సంఘాలకు రుణ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధితో పాటు సమీప గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చేందుకు సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణకు అనుగుణంగా ప్రస్తుత వసతులను బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. యర్రగుంట్ల పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వ స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

యర్రగుంట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై శాఖల వారీగా బాధ్యతలు నిర్దేశించుకుని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు స్థానిక నాయకులు భూపేష్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి, జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, విద్యుత్, గృహ నిర్మాణ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో చురుగ్గా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలి

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 3: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ ఎల్. రాధిక ఆదేశాల మేరకు దిశా ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ, ఎన్‌జీవో ప్రతినిధులతో స్థానిక డీహెచ్ఓ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఏఆర్టీ, ఐసీటీసీ, ఎన్‌జీవోలకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల